విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక






హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 341 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూన్ 2025 | వెల : రూ 10/-




## స్థానిక ఎన్నికలపై హైకోర్టులో విచారణ

ఎన్నికల నిర్వహణకు 60రోజుల సమయం కావాలన్న ఈసీ

హైదరాబాద్,
ఎన్నికలు నిర్వహించడానికి మరో 60 రోజులు సమయం కావాలని ఎలక్షన్ కమిషన్ హైకోర్టును కోరింది. స్థానిక సంస్థల ఎన్నికల పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం విచారణ చేసింది. ఆరు నెలల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల కేసు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున న్యాయవాదులు తమ వాదనలను కోర్టుకు వివరించారు. ఎన్ని రోజుల్లో ప్రభుత్వం ఈ ఎన్నికలు నిర్వహిస్తుందో -మిగతా 3 లో



## కొత్తగా స్పోర్ట్స్ పాలసీకి
# కేబినేట్ ఆమోదం

- త్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణంలో కీలక నిర్ణయం
- చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201కి.మీ ఆమోదం
- కాళేశ్వరం కమిషన్‌కు కేబినేట్ మినిట్స్ నోట్ అందచేత
- రైతుభరోసా విజయవంతంతో నేడు రైతునేస్తం సభ
- బనకచర్లపై రాజీపడేది లేదని నిర్ణయం
- కేబినేట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ
చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201కి.మీ మేర ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. కాళేశ్వరం కమిషన్ కోరిన మేరకు కేబినెట్ మినిట్స్ వివరాలు అందించాలని నిర్ణయించారు. అలాగే రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా జమ అయినందున -మిగతా 3 లో



## ఉప ఎన్నికల్లో సత్తా చాటిన ఆప్

- గుజరాత్, పంజాబ్‌లో సీట్లు నిలబెట్టుకున్న ఆమ్ ఆద్మీ
- కేరళలో ఎల్డీఎఫ్‌కు షాక్..కాంగ్రెస్ వశమైన నిలంబర్
- రాజ్యసభకు వెళ్లడం లేదన్న ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ
గుజరాత్, పంజాబ్ ఉప ఎన్నికల్లో ఆప్ సత్తా చాటింది. గుజరాత్‌లో బిజెపికి ఓటమి తప్పలేదు. దేశ వ్యాప్తంగా జూన్ 19న ఐదు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా.. సోమవారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఈ ఉప ఎన్నికల్లో గుజరాత్‌లో ఆప్ ఒక స్థానాన్ని కైవసం చేసుకొని సత్తా చాటింది. విశావదర్ సీటు నుంచి భాజపా అభ్యర్థి కిరీట్ పటేల్‌పై ఆప్ నేత గోపాల్ ఇటాలియా 17వేల పైచిలుకు ఓట్లతేడాతో విజయం సాధించారు. గుజరాత్‌లో భాజపాకు పూర్తి ఆధిపత్యం ఉన్నప్పటికీ.. -మిగతా 3 లో

## నేడు రైతు భరోసా విజయోత్సవ సభ

- సచివాలయం రాజీవ్ విగ్రహం వద్ద నిర్వహణ
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ
రైతు భరోసా విజయోత్సవ సభ ను మంగళవారం నాడు సచివాలయం ఎదురుగా గల రాజీవ్ గాంధీ విగ్రహ ఆవరణలో నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయ, సహకార,మార్కెటింగ్ జోళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతు భరోసా విజయోత్సవం సభ నేపథ్యంలో చేపట్టబోయే ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల అధికారులతో కలిసి -మిగతా 3 లో





## అమెరికా పై ఇరాన్ ప్రతీకార దాడి..

- ఖతార్, ఇరాక్‌లోని స్థావరాలపై క్షిపణుల వర్షం
- అగ్రరాజ్యంపై ఆపరేషన్ 'బెషారత్ ఫతాహ్'
- ఇరాన్ దాడులను తిప్పికొట్టామన్న ఖతార్
- సిరియాలో బేస్‌పై ఇరాన్ అనుకూలుర దాడి!

టెహ్రాన్,
తమ అణు కేంద్రాల మీద అమెరికా జరిపిన వైమానిక దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ సోమవారం ప్రతీకార దాడులకు దిగింది. ఇరాన్, ఇరాక్‌లోని అమెరికా వైమానిక స్థావరాలపై క్షిపణుల వర్షం కురిపించింది. అగ్రరాజ్యం దురాక్రమణకు వ్యతిరేకంగా ఆపరేషన్ 'బెషారత్ ఫతాహ్'ను ప్రారంభించినట్టు ప్రకటించింది. ఖతార్‌లోని అమెరికా వైమానిక స్థావరం అల్ ఉదీద్‌పై క్షిపణులతో దాడిచేసినట్టు ఇరాన్ టీవీ వెల్లడించింది. అల్ ఉదీద్ పశ్చిమాసియాలోనే -మిగతా 3 లో

## రైతు భరోసా నిధుల విడుదలతో
# రైతుల్లో ఆనందం

ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు 12వేల నిధుల విడుదల



- నేడు మండలాల్లో రైతుభరోసా సంబరాలు
- డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ
రాష్ట్రవ్యాప్తంగా 9 రోజుల్లో రూ. కోట్లలో రైతు భరోసా నిధులు విడుదల చేసినట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇప్పటి వరకు కోటి 49లక్షల 39వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎకరాకు రూ.12వేల చొప్పున అన్ని వ్యవసాయ భూములకు అందించినట్లు తెలిపారు. గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్ల సమావేశంలో భట్టి విక్రమార్క పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా కింద నిధులను రైతుల ఖాతాల్లో ఈ -మిగతా 3 లో



## పాక్ విమానాలకు గగనతల నిషేధం పొడిగింపు

జూలై 24 వరకు నిషేధం కొనసాగుతుందని వెల్లడి

న్యూఢిల్లీ
పాకిస్థాన్ ఎయిర్‌లైన్స్ విమానాలకు మన గగనతల నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం మరో నెల పాటు పొడిగించింది. జూలై 24 వరకు నిషేధం కొనసాగుతుందని తెలిపింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాక్ విమానాలకు గగనతల నిషేధాన్ని విధిస్తూ ఏప్రిల్ 30న కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే.అనంతరం దీన్ని పొడిగిస్తూ వస్తున్నది. మరోవైపు, పాకిస్థాన్ కూడా భారత విమానాలకు తమ గగగతల నిషేధాన్ని పొడిగించింది. -మిగతా 3 లో



## ఆదివాసీలపై దాడి అమానుషం

- పేదలన్న ప్రేమ లేదు.. ఆడబిడ్డలన్న ఇంగితంలేదు
- హైదరాబాద్ మీదికే కాదు.. అడవిపైకీ బుల్డోజర్లు

హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ
'పేదలన్న ప్రేమలేదు.. ఆడబిడ్డలన్న ఇంగితంలేదు.. అందుకే రేవంత్ సర్కారు పోడు భూములు సాగు చేసి పొట్టపోసుకుంటున్న ఆదివాసీ బిడ్డలపై దాడులకు దిగింది. ఆడబిడ్డలను వివస్త్రలను చేసి కొట్టించింది' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. -మిగతా 3 లో

## హైదరాబాద్ పలు ప్రాంతాల్లో వర్షం

- నేడు పలు జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం
- నిజామాబాద్‌లో ఈదురు గాలుల వర్షం పడే ఛాన్స్
- వాతావరణ విభాగం హెచ్చరిక



హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ
: హైదరాబాద్ మహానగరంలో పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో వర్షం దంచి కొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. -మిగతా 3 లో

## ప్రజలను మోసం చేయడంలో
# కాంగ్రెస్ ముందంజ



గొల్ల కుర్మలను కూడా మోసానికి గురి చేస్తే ఎలా
మాజీమంత్రి హరీస్ రావు విమర్శలు

హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ
తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ హామీలను తుంగలో తొక్కిందని కాంగ్రెస్ పాలనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఎక్స్ వేదికగా -మిగతా 3 లో

# మా నీళ్లు మాకివ్వకపోతే భారత్‌తో యుద్ధం..

పాక్ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో హెచ్చరిక



**ఇస్లామాబాద్– ప్రజా స్వేచ్ఛ**

సింధూ జలాల ఒప్పందం కింద తమకు న్యాయబద్ధంగా రావలసిన వాటాను ఇవ్వని పక్షంలో భారత్‌పై తమ దేశం యుద్ధానికి వెళుతుందని పాకిస్థాన్ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ సోమవారం హెచ్చరించారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి అనంతరం 1960 నాటి సింధూ జలాల ఒప్పందాన్ని భారత ప్రభుత్వం నిలిపివేసింది. ఈ చారిత్రాత్మక ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తి లేదని భారత హోం మంత్రి అమిత్ షా గత వారం ప్రకటించారు.అంతర్జాతీయ ఒప్పందాలను అమిత్ షా గౌరవించడం లేదని పాక్ విదేశాంగ శాఖ విమర్శించిన రెండు రోజులకే బిలావల్ భుట్టో ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'భారత్‌కు రెండు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. న్యాయబద్ధంగా మా వాటాను మాకు పంచడం లేదా ఆరు నదుల నుంచి మా వాటాను మేమే తీసుకోవడం' అని బిలావల్ వ్యాఖ్యానించారు. సింధూ బేసిన్‌లోని ఆరు నదులను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సింధూ జలాల ఒప్పందం అమలులోనే ఉందని, సస్పెన్షన్‌లో ఉంచడం సాధ్యం కాదని చెప్పారు.

# త్వరలో సైన్యానికి సరికొత్త గన్స్..

-డీఆర్డీవోకు భారీ ఆర్డర్ ఇచ్చిన సైన్యం..!



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

భారత సైనికులకు త్వరలో అత్యాధునిక గన్‌లు అందనున్నాయి. ప్రస్తుతం ఉపయోగిస్తున్న స్టెర్లింగ్ కార్బైన్‌ల స్థానంలో ఈ కొత్త గన్‌లను సైన్యం ఇవ్వనున్నది. క్లోజ్ క్వార్టర్ బ్యాటిల్ కార్బైన్‌లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. కొత్త అత్యాధునిక గన్ ల తయారీ కోసం సైన్యం డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (DRDO), భారత్ ఫోర్జ్ లిమిటెడ్‌లకు ఆర్డర్ ఇచ్చింది. ఆర్మీ రూ.2వేలకోట్ల విలువైన ఒప్పందానికి సంబంధించి డీఆర్డీవో, భారత్ ఫోర్జ్ లిమిటెడ్ ఎల్-1 బిడ్డర్స్‌గా ఎంపికయ్యాయి. 5.56ఐ45 mm CQB కార్బైన్‌ను డీఆర్డీవో ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ , భారత్ ఫోర్జ్ లిమిటెడ్ రూపొందించాయి. ఈ కార్బైన్‌ను భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ అయిన కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్‌కు చెందిన పుణే యూనిట్లో ఉత్పత్తి అయ్యే అవకాశం ఉన్నది. భారత సైన్యం ప్రస్తుతం 1940లో రూపొందించిన సబ్-మెషిన్ గన్ అయిన స్టెర్లింగ్ కార్బైన్‌ను ఉపయోగిస్తోంది. సైన్యం చాలా కాలంగా స్టెర్లింగ్ కార్బైన్‌ను భర్తీ చేయడానికి సిద్ధమవుతోంది. ప్రస్తుత యుద్ధ పరిస్థితులకు స్టెర్లింగ్ కార్బైన్ సరిపోతదని సైన్యం భావించింది. ఈ క్రమంలోనే చాలారోజుల నుంచి క్లోజ్ క్వార్టర్ బ్యాటిల్ కార్బైన్స్ కోసం ప్రయత్నిస్తున్నది. పూణేలోని డీఆర్డీవో ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ కొత్త కార్బైన్‌ను రూపొందించాలని నిర్ణయించుకుంది. 5.56ఐ45 mm CQB కార్బైన్ చిన్న, తేలికపాటి కార్బైన్ కావడంతో ఎన్‌కౌంటర్లలో ఖచ్చితమైన ప్రతిస్పందన ఇవ్వనుండగా.. ఇందులో అనేక ఆధునిక ఫీచర్స్ ఉన్నాయి. ఆప్టిక్స్, లేజర్ డిజిగ్నేటర్స్ తదితర యాక్సెసరీస్ డిజైన్‌ల ఇన్‌స్టాల్ చేయబడి ఉంటాయి. ఈ డీల్‌లో దాదాపు 4లక్షలకుపైగా గన్స్ తయారు చేసి సైన్యానికి అందించనున్నట్లు తెలుస్తున్నది.

# ఇజ్రాయిల్ దాడుల్లో 500 మంది మృతి

**టెహ్రాన్ – ప్రజా స్వేచ్ఛ**

ఇజ్రాయిల్ చేపడుతున్న దాడుల్లో ఇప్పటి వరకు 500 మంది మరణించినట్లు ఇవాళ ఇరాన్ మీడియా ప్రకటించింది. జూన్ 13వ తేదీ నుంచి ఇరాన్‌పై ఇజ్రాయిల్ అటాక్ చేస్తున్న విషయం తెలిసిందే. మృతుల సంఖ్యపై ఇవాళ ఆ దేశ ఆరోగ్యశాఖ ప్రకటన చేసింది. ఇజ్రాయిల్ నిర్వహించిన దాడుల్లో సుమారు మూడు వేల మంది గాయపడినట్లు ఇరాన్ స్టేట్ మీడియా తెలిపింది. అయితే అంతర్జాతీయ మీడియాపై ఇరాన్ ఆంక్షలు విధించడం వల్ల పలు మీడియా సంస్థలు ఆ దేశంలోకి వెళ్లలేకపోతున్నాయి. ఇజ్రాయిల్ దాడుల వల్ల ఇరాన్‌లో ఎంత నష్టం జరిగిందన్న దానిపై స్పష్టమైన అంచనా వేయడం వీలుకావడం లేదు. ఇరాన్‌లో పనిచేస్తున్న మానవ హక్కుల సంస్థ మాత్రం మృతుల సంఖ్య రెట్టింపుగా ఉండే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నది.ఫోర్డో భూగర్భ అణు కేంద్రంపై



ఇవాళ జరిగిన దాడులు గురించి ఇజ్రాయిల్ రక్షణ దళాలు ప్రకటన చేశాయి. ఫోర్డో అణు కేంద్రానికి వెళ్లే మార్గాలపై దాడులు చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. యాక్సెస్ రూట్లను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఆదివారం తెల్లవారుజామున అమెరికాకు చెందిన బీ2 బాంబర్లు.. ఫోర్డో న్యూక్లియర్ సైట్‌పై బంకర్ బస్టర్ బాంబర్లతో దాడి చేసిన విషయం తెలిసిందే. ఇరాన్ గగనతలంలోకి కమర్షియల్ విమానాలు ప్రవేశించడం లేదు. ప్రస్తుత డేటా ప్రకారం ఇరాన్ గగన క్షేత్రాన్ని కమర్షియల్ ఫ్లయిట్స్ దూరంగా పెట్టినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో పాటు ఇరాక్, సిరియా, జోర్డాన్, లెబనాన్ ఎయిర్‌స్పేస్‌ను కూడా విమానాలు వాడుకోవడంలేదు. దుబాయ్ ఎయిర్‌పోర్టులో ఇవాళ సుమారు 120 విమానాలు ఆలస్యం అయ్యాయి. జోర్డాన్‌లోని క్వీన్ అలియా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో 40 శాతం విమానాలు రద్దు అయ్యాయి. దుబాయ్‌కి వెళ్లే విమానాలను జూలై 3వ తేదీ వరకు యునైటెడ్ ఎయిర్‌లైన్స్ రద్దు చేసింది. దుబాయ్, దోహాలకు బ్రిటీష్ ఎయిర్‌వేస్ తన విమానాలను రద్దు చేసింది.

# ఇరాన్‌పై విరుచుకు పడుతున్న ఇజ్రాయిల్

15 యుద్ధవిమాలతో పలు ప్రాంతాల్లో దాడులు



**టెలీఅవివ్,ప్రజా స్వేచ్ఛ**

ఇరాన్ వైమానిక స్థావరాలపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. దేశంలో పశ్చిమ, తూర్పు, మధ్య ప్రాంతాల్లో గల ఆరు వైమానిక స్థావరాలపై భీకర దాడులు చేసింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ మిలిటరీ తాజాగా వెల్లడించింది. దాడుల తాలూకు వీడియోలు కూడా షేర్ చేసింది. 15 యుద్ధ విమానాలతో ఈ దాడులు చేశామని తెలిపింది. రన్‌వేలు, భూగర్భంలోని బంకర్‌లు, ఓ రీఫ్యుయెలింగ్ ప్లేన్, ఎఫ్-14, ఎఫ్-5, ఏహెచ్-1 విహంగాలు, హెలికాప్టర్‌లు ధ్వంసమయ్యాయని పేర్కొంది. ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించాలనుకున్న యుద్ధ విమానాలను ధ్వంసం చేసినట్టు తెలిపింది. మిసైళ్లను నిల్వ చేసిన స్థావరాలను కూడా నాశనం చేసినట్టు పేర్కొంది. కచ్చితమైన నిఘా సమాచారంతో ఈ దాడులు చేసినట్టు వెల్లడించింది. ఇరాన్ మిలటరీ సామర్థ్యాలను దెబ్బతీసేందుకు నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటామని, గగనతల యుద్ధంలో సంపూర్ణ ఆధిపత్యమే తమ లక్ష్యమని వెల్లడించింది. ఇరాన్ అణుస్థావరాలను అమెరికా ధ్వంసం చేశాక ఇజ్రాయెల్ మళ్లీ తన దాడులను కొనసాగిస్తోంది.

# ముగ్గురు ఎమ్మెల్యేలను బహిష్కరించిన ఎస్పీ..

– బీజేపీతో సంబంధాలున్నాయని ఆరోపణ



**లక్నో-ప్రజా స్వేచ్ఛ**

ఉత్తరప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) కీలక నిర్ణయం తీసుకున్నది. అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని ఈ పార్టీ ముగ్గురు ఎమ్మెల్యేలను బహిష్కరించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతోపాటు బీజేపీతో వారికి సంబంధాలున్నట్లు ఆరోపించింది. గోసాయిగంజ్ ఎమ్మెల్యే అభయ్ సింగ్, గౌరీగంజ్ ఎమ్మెల్యే రాకేష్ ప్రతాప్ సింగ్, ఉంచహార్ ఎమ్మెల్యే మనోజ్ కుమార్ పాండేను పార్టీ నుంచి బహిష్కరించినట్లు ఎక్స్‌లో పేర్కొంది.కాగా, ఈ ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు, మతపరంగా విభజన సృష్టించే ప్రతికూల భావజాల పార్టీతో సంబంధం కలిగి ఉన్నారని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఆరోపించింది. తమ రాజకీయ వైఖరిని పునఃపరిశీలించేందుకు ఇచ్చిన సమయం ముగిసినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో పార్టీతోపాటు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ ముగ్గురు ఎమ్మెల్యేలను బహిష్కరించాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. బహిష్కరించిన ఎమ్మెల్యేలు 2024లో జరిగిన రాజ్యసభ ఎన్నికల సమయంలో పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి ఓటు వేశారని ఎస్పీ ఆరోపించింది.

# పహల్గాంకు పర్యాటకులు క్యూ..

ఫొటోలు షేర్ చేసిన జమ్ముకశ్మీర్ సీఎం




**జమ్ము కశ్మీర్ -ప్రజా స్వేచ్ఛ**

జమ్ము కశ్మీర్ లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం పహల్గాం లో గల మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరాన్ వ్యాలీలో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ దాడితో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ముష్కరులు సృష్టించిన నరమేధంలో 26 మంది బలయ్యారు. అయితే, ఈ దాడి తర్వాత జనం ఆ ప్లేస్‌కు వెళ్లేందుకు భయపడ్డారు. దీంతో పర్యాటకులు లేక వ్యాలీ మొత్తం ఇన్నిరోజులూ వెలవెలబోయింది. అయితే, ఇప్పుడు మళ్లీ అక్కడ సందడి వాతావరణంపెద్ద ఎత్తున టూరిస్ట్‌లు పహల్గాం బాట పట్టారు. ఆ ప్రాంతానికి పర్యాటకులు క్యూ కడుతున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఎక్స్ వేదికగా షేర్ చేశారు. పహల్గాంలో మళ్లీ సందడి నెలకొన్నట్లు పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు చల్లని వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నట్లు చెప్పారు. జమ్ము కశ్మీర్ పర్యాటక రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించడాన్ని చూసి చాలా సంతృప్తికరంగా ఉందన్నారు. ఈ మేరకు అక్కడ టూరిస్ట్ వెహికల్స్‌తో రోడ్లన్నీ రద్దీగా ఉన్న ఫొటోలను ఎక్స్‌లో షేర్ చేశారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి.

# ఇరాన్‌కు రష్యా ఎందుకు సాయం చేయట్లేదు..?

పుతిన్ సమాధానం ఇదే..



**టెహ్రాన్ -ప్రజా స్వేచ్ఛ**

ఇరాన్ పై అమెరికా దాడితో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఆదివారం తెల్లవారుజామున ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలు లక్ష్యంగా బంకర్ బస్టర్ బాంబులతో అమెరికా విరుచుకుపడింది. అయితే, ఇరాన్‌కు సుదీర్ఘకాలం మిత్రదేశంగా ఉన్న రష్యా మాత్రం టెహ్రాన్‌కు సాయం అందించేందుక ఇప్పటి వరకూ ముందుకురాలేదు. దీంతో ఈ విషయంలో రష్యాపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విమర్శలపై రష్యా అధ్యక్షుడు పుతిన్ తాజాగా స్పందించారు. రష్యా – ఇరాన్ దశాబ్దాలుగా సన్నిహిత సంబంధాలను కలిగి ఉన్నప్పటికీ.. రష్యన్ మాట్లాడే ప్రజలు పెద్ద సంఖ్యలో ఇజ్రాయెల్‌లో నివసిస్తున్నందున ఈ వివాదంలో తటస్థంగా ఉన్నట్లు పుతిన్ వెల్లడించారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక వేదికపై పుతిన్ మాట్లాడుతూ.. ఒకప్పటి సోవియట్ యూనియన్, రష్యన్ ఫెడరేషన్‌కు చెందిన దాదాపు రెండు మిలియన్ల మంది ఇజ్రాయెల్‌లో నివసిస్తున్నట్లు చెప్పారు. తమ దృష్టిలో ఇప్పుడు అది రష్యన్ మాట్లాడే దేశమన్నారు. అందుకే ఈ వివాదంలో తటస్థంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నట్లు పుతిన్ వివరించారు.

# కేరళ మాజీ సిఎం అచ్యుతానందన్‌కు అస్వస్థత

– నిలకడగా ఆరోగ్య పరిస్థితి

**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

సిపిఎం సీనియర్ నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన సోమవారం తిరువనంతపురంలోని పట్టోంలో శ్రీ ఉత్రాడోం తిరునాల్ (ఎస్‌యుటి) ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన ఐసియులో ఉన్నారు. 2019లో స్ట్రోక్‌తో మంచం పట్టిన అచ్యుతానందన్ సోమవారం ఉదయం అస్వస్థతకు గురయ్యారు. దీంతో శ్వాస తీసుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడ్డారు. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఆయన వయసు 101 సంవత్సరాలు.

# కొత్తగా స్పోర్ట్స్ పాలసీకి కేబినేట్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

మంగళవార రాష్ట్రవ్యాప్తంగా భరోసా రైతు నేస్తం సభలు నిర్వహించాలని నిర్ణయించారు. సోమవారం సుదీర్ఘంగా భేటీ అయిన కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. భేటీలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. నేటితో రైతులందరికీ రైతుభరోసా పూర్తవుతుందని, 9 రోజుల్లో రూ. 9 వేల కోట్ల మొత్తాన్ని రైతులకు అందజేశామని తెలిపారు. రైతుభరోసా కార్యక్రమం పూర్తయిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో రైతుల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేబినెట్ నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లోనూ పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రి మండలితో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలు, బనకచర్లపై చర్చ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కి గత కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రివర్గ ఆమోదం ఉందా లేదా అనే అంశంతో పాటు పూర్తి వివరాలను ఈ నెల 30వ తేదీలోగా కమిషన్‌కి అందివ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. పీసీ ఘోష్ కమిషన్‌కు మినిట్స్‌తో కూడిన పూర్తి నివేదిక ఇవ్వాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే స్పోర్ట్స్ పాలసీని కేబినెట్ ఆమోదించింది. మంగళవారం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా విజయోత్సవ సభలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 9 లక్షల ఫిర్యాదులను స్పెషల్ డ్రైవ్ ద్వారా క్లియర్ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కాగా, మంత్రివర్గ సమావేశానికి కొత్తగా బాధ్యతలు చేపట్టిన మంత్రులు వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. 'వ్యవసాయం దండగ కాదు.. పండుగ అనేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి పొంగులేటి అన్నారు. తెలంగాణ నీటి వాటాను ఏపీకి అప్పగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. బనకచర్ల బంకను మా ప్రభుత్వానికి రుద్దాలని ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో చట్టపరంగా, న్యాయపరంగా ముందుకెళ్తాం. గోదావరి జలాల్లో ఒక్క చుక్క కూడా వదులుకోవద్దని నిర్ణయం తీసుకున్నాం. గోదావరి జలాల విషయంలో జులై మొదటి వారంలో కేంద్రం వద్ద రాష్ట్ర ప్రభుత్వ వాదనలు వినిపిస్తాం. కాళేశ్వరంపై ఈనెల 30లోపు కమిషన్‌కు పూర్తి వివరాలు ఇవ్వాలని నిర్ణయించాం. కాళేశ్వరానికి గత ప్రభుత్వ మంత్రివర్గ ఆమోదం ఉందా? లేదా? వివరాలు ఇవ్వాలని నిర్ణయించాం' అని పొంగులేటి వివరించారు. నూతన క్రీడా పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. క్రీడా కోటాలో రిజర్వేషన్లు పెంచాలని, క్రీడాకారులను ప్రోత్సహించేలా పారితోషికాలు ఇవ్వాలని నిర్ణయించింది. మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి కూడా పాల్గొన్నారు.

# ఉప ఎన్నికల్లో సత్తా చాటిన ఆప్

(మొదటి పేజీ తరువాయి)

2007 నుంచి విశావదర్ స్థానాన్ని గెలుచుకోలేకపోతోంది. అయితే, గత ఎన్నికల్లో ఈ సీటులో ఆప్ కైవసం చేసుకున్న ప్పటికీ.. ఎమ్మెల్యే భూపేంద్ర భయానీ రాజీనామా చేసి భాజపాలో చేరారు. దీంతో ఆ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో మళ్లీ ఆప్ విజయం సాధించింది. అలాగే, గుజరాత్‌లో కాడి అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో భాజపా అభ్యర్థి రాజేంద్ర చావ్డా విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి రమేశ్ చావ్డాపై జయకేతనం ఎగురవేశారు. పంజాబ్‌లోని లుథియానా వెస్ట్ సీటుకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార ఆప్ విజయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ అభ్యర్థి భరత్ భూషణ్ ఆషుపై ఆప్ అభ్యర్థి, రాజ్యసభ ఎంపీ సంజీవ్ అరోడా 10,637 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇక్కడ ఆప్ అభ్యర్థి అరోడాకు 35,179 రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి ఆషుకు 24,542 ఓట్లు, భాజపా అభ్యర్థి జివాన్ గుప్తాకు 20,323 ఓట్లు; అకాలీదళ్ అభ్యర్థికి కేవలం 8,203 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఇక్కడ ఆప్ ఎమ్మెల్యే గురుప్రీత్ బస్సీ గోగి మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. గుజరాత్‌లోని విశావదర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆప్ విజయం సాధించడంపై కేజ్రీవాల్ హర్షం వ్యక్తం చేశారు. గుజరాత్ ప్రజలు భాజపాతో విసిగివేసారిపోయారని, ఇప్పుడు వారంతా ఆప్‌వైపే చూస్తున్నారన్నారు. గుజరాత్‌లో రెండు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా.. విశావదర్‌లో ఆప్ అభ్యర్థి విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ.. ఆప్‌ని ఓడించేందుకు భాజపా, కాంగ్రెస్ పంజాబ్, గుజరాత్ ఎన్నికల్లో పోటీ చేస్తే.. ప్రజలు వారిని తిరస్కరించారన్నారు. పంజాబ్‌లోని లుథియానా పశ్చిమ స్థానంలోనూ ఆప్‌ను గెలిపించడం ద్వారా పంజాబ్ ప్రజలు తమ ప్రభుత్వ పనితీరుకు ఆమోదం తెలిపారన్నారు. గుజరాత్‌లో భాజపా, ఆప్ మధ్యే ప్రత్యక్ష పోటీ ఉందన్న ఆయన.. భాజపాకు కాంగ్రెస్ కీలుబొమ్మగా మారిపోయిందని ఆరోపించారు. ఈ క్రమంలో రాజ్యసభకు ఎంట్రీ ఇవ్వబోతున్నారంటూ జరుగుతోన్న ప్రచారంపై ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. తాను రాజ్యసభకు వెళ్లడంలేదని స్పష్టం చేశారు. పంజాబ్‌లోని లుథియానా పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆప్ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజీవ్ అరోడా విజయం సాధించారు. దీంతో ఆయన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తే..ఖాళీ అయ్యే ఈ స్థానం నుంచి కేజ్రీవాల్ పెద్దలసభలో అడుగుపెట్ట బోతున్నారంటూ విపక్షాలు పలు వ్యాఖ్యానాలు చేస్తూ వచ్చాయి. అయితే, తాను రాజ్యసభకు వెళ్లట్లేదని స్పష్టత ఇచ్చిన కేజ్రీవాల్.. ఖాళీ అయ్యే రాజ్యసభ సీటు నుంచి ఎవరు పోటీ చేయాలనేది ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. మరోవైపు, కేరళలో నిలంబర్ అసెంబ్లీ నియోజక వర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో అధికార ఎల్డీఎఫ్‌కు షాక్ తగిలింది. ఈ సీటులో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ అభ్యర్థి ఆర్యదాన్ షౌకత్ సీపీఎం అభ్యర్థిపై 11,077 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. షౌకత్ ప్రముఖ కాంగ్రెస్ నేత ఆర్యదాన్ ముహమ్మద్ తనయుడు. గత ఎన్నికల్లో ఎల్డీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన పీవీ అన్వర్ రాజీనామాతో ఈ సీటుకు ఉప ఎన్నిక అనివార్యమైంది. మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లోని కాలీగంజ్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. టీఎంసీ అభ్యర్థి అలీఫా అహ్మద్‌కు 32,308 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థికి కేవలం 13,144 ఓట్లు మాత్రమే వచ్చాయి. భాజపా అభ్యర్థి 11,987 ఓట్లతో మూడో స్థానానికి పరిమితమయ్యారు. టీఎంసీ సిట్టింగ్ ఎమ్మెల్యే నసీరుద్దీన్ అహ్మద్ మృతితో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యం కాగా.. ఆయన కుమార్తె అలిఫా అహ్మద్‌ను దీదీ బరిలో నిలిపారు.

రైతు భరోసా నిధుల విడుదలతో

# రైతుల్లో ఆనందం

(మొదటి పేజీ తరువాయి)

నెల 16 నుంచి జమ చేస్తున్నామని.. ఇది జూన్ 24తో పూర్తవుతుందని భట్టి వివరించారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు అన్ని మండల కేంద్రాల్లో రైతు భరోసా సంబరాలు పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, సీడబ్ల్యూసీ సభ్యులు వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథం, రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్ల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 'రాజ్యాంగ పరిరక్షణకు జై సంవిధాన్ కార్యక్రమంపై అవగాహన పెంచాలి. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత నాయకులపై ఉంది. సీనియర్లు, జూనియర్లు సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు.

# ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ ముందంజ

(మొదటి పేజీ తరువాయి)



చేసిన వ్యాఖ్యలలో ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం పలు ప్రజా ప్రయోజన పథకాలను నిలిపి వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా బంద్, గ్యాస్ బండకు రాయితీ బంద్, రాజీవ్ యువ వికాసం అమలుకు కాకముందే బంద్, గొర్రెల పంపిణీ మొత్తానికే బంద్.. ఇలా చెప్పుకుంటూ పోతే కాంగ్రెస్ పాలనలో అన్ని పథకాలు బందయినట్టే అని హరీష్ పేర్కొన్నారు. ఆత్మశుద్ధిలేని యాచార మదియేల, భాండశుద్ధి లేని పాకమేల? అనే సామెతను కోట్ చేస్తూ కాంగ్రెస్ నైతికతను ప్రశ్నించారు.

# హైదరాబాద్ పలు ప్రాంతాల్లో వర్షం

(మొదటి పేజీ తరువాయి)

గత కొద్దిరోజుల నుంచి వాతావరణం చల్ల బడింది. కొంత సేపు ఎండలు పెట్టినా.. మిగితా సమయం మబ్బులు కమ్ముకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే సోమవారం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది నేడు మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు మెరుపులతో పాటు ఈదురుగాలుల ప్రభావం ఉంటుందని పేర్కొంది. నిజామాబాద్ జిల్లాలో కూడా గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో వర్షాలు పడే అవకాశముందని వెల్లడించింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఇవి కశ్మీర్, సిమ్లా మీదుగా హిమాలయాల వరకు విస్తరిస్తుండగా, మరో రెండు మూడు రోజుల్లో దేశమంతటా వ్యాపించనున్నాయని భారత వాతావరణశాఖ, విశాఖపట్నం తెలిపింది. ఈ సారి రుతుపవనాల వ్యాప్తి మాములు కంటే సుమారు 15 రోజులు ముందుగానే వచ్చాయని తెలిపింది. ఈ నేపథ్యంలో నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడడంతో, 5.8 నుండి 7.6 కిలోమీటర్ల పైన ఆవరించడంతో.. దీనివల్ల రాబోయే రెండు రోజులు వర్షాల సూచన ఉండనుంది. ఉత్తర కోస్తాంధ్రలో ఒకటి రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే సూచనలున్న నేపథ్యంలో, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికార అధికారులు హెచ్చరించారు. రుతుపవనాల ఈ చురుకైన ప్రవాహంతో వ్యవసాయానికి అనుకూల వాతావరణం ఏర్పడనుంది.

# ఆదివాసీలపై దాడి అమానుషం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ మీదికే కాదు.. అడవులపైకీ బుల్డోజర్లు పంపడం సిగ్గుచేటని సోమవారం ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. 420 హామీలు అమలు చేయ డం చేతగాక, హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట రాష్ట్ర రాజధానిలో పేదల ఇండ్లు కూల్చడమే పనిగా పెట్టుకున్నదని దెప్పిపొడిచారు.రోడ్ల విస్తరణ, పరిశ్రమలకు భూ సేకరణ పేరిట లగచర్ల, దిలావర్‌పూర్, పెద్ద ధన్వాడ, చారగొండ, సిరసనగండ్లలో రైతుల పొలాలు, ఇండ్లమీదికి బుల్డోజర్లను పంపి పైశాచికానందం పొందుతున్నదని ధ్వజమెత్తారు. ప్రశ్నిస్తే, ఎదిరిస్తే, నిలదీస్తే నిర్దాక్షిణ్యంగా కేసులు నమోదు చేస్తూ దుర్మార్గాలకు ఒడిగడుతున్నదని విమర్శించారు. 420 హామీలను పక్కకు పెట్టి కూల్చే, కాల్చే పథకాలను ముందుకు తెచ్చిందని ఎద్దేవాచేశారు.

# స్థానిక ఎన్నికలపై హైకోర్టులో విచారణ

(మొదటి పేజీ తరువాయి)

చెప్పాలని హైకోర్టు పిటీషనర్లను ప్రశ్నించింది. గత ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని.. ఎందుకు ఎన్నికలు నిర్వహించలేదని న్యాయస్థానం నిలదీసింది. తెలంగాణ రాష్ట్రంలో కులగణన సర్వే పూర్తి అవ్వలేదని కొంత సమయం కావాలని కోర్టుని ప్రభుత్వం కోరింది. ఎన్నికలు నిర్వహించడానికి మరో 60 రోజులు సమయం కావాలని ఎలక్షన్ కమిషన్ అడిగింది. ఎన్నికలైనా పెట్టాలని లేదా పాత సర్పంచ్‌లనే కొనసాగించాలని పిటీషనర్లు వాదనలు వినిపించారు. ఆరు నెలల్లో ఎన్నికలు పూర్తి చేయాలని నిబంధన ఉందని.. కానీ ప్రభుత్వం ఈ ఎన్నికలు నిర్వహించలేదని పిటీషనర్లు వాదనలు వినిపించారు. కాగా 2024 ఫిబ్రవరి 1వ తేదీన తెలంగాణ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. పిటిషనర్లు, ప్రభుత్వం, రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ వాదనలు విన్న తర్వాత న్యాయస్థానం ఈ తీర్పు ఇచ్చింది. ఎన్నికలు నిర్వహణకు సమయం కావాలని ప్రభుత్వం కోరడంతో తెలంగాణ హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది.

# నేడు రైతు భరోసా విజయోత్సవ సభ

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు సహచర మంత్రులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతాంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, తెలంగాణ రైతులను రాజులుగా చూడాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని అన్నారు. రైతుల వ్యవసాయ పనులకు తొలకరికి ముందుగానే రైతు భరోసాను తొమ్మిది రోజులలో రూ. 9 వేల కోట్ల రూపాయలు రైతు ఖాతాలో జమ చేయడం జరిగిందని స్పష్టం చేశారు. రైతుల సంతోషాలు పంచుకోవడం కోసం రైతు నేస్తం వేదిక ద్వారా మంగళవారం సెక్రటేరియట్ ముందుగల రాజీవ్ విగ్రహం ప్రాంగణంలో విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు, దేశంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ గారి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రైతులకు రూ. 70 వేల కోట్లు రుణమాఫీ జరిగితే తెలంగాణలో ఇప్పుడు 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ కింద రూ. 21 వేల కోట్లు చెల్లించటం జరిగిందని అన్నారు. ఇట్టి కార్యక్రమానికి అన్ని జిల్లాల నుండి రైతు భరోసా పొందిన లబ్దిదారులు పాల్గొననున్నారని , కార్యక్రమం ఏర్పాట్లు ఎక్కడ కూడా లోపాలు లేకుండా, రైతులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని మంత్రి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. విద్యుత్, త్రాగునీరు, షామియానాలు, సీటింగ్ కెపాసిటీ, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ తదితరు అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తో అధికారులకు కలిసి దిశా నిర్దేశర చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ అహమ్మద్ నదీమ్, హైదరాబాద్ కమిషనర్ పోలీస్ సివి ఆనంద్, అడిషనల్ డీజీ లా అండ్ ఆర్డర్స్ ఎంఎం భగవత్, ట్రాన్స్పోర్ట్ శాఖ కమిషనర్ సురేందర్ మోహన్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, ఐ అండ్ పి ఆర్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక, ఉద్యాన శాఖ కమిషనర్ యాస్మిన్ భాష, ఄూఖఆఅఀ ఎండి ముస్రాఫ్ అలీ, వ్యవసాయ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అమెరికా పై ఇరాన్ ప్రతీకార దాడి..

(మొదటి పేజీ తరువాయి)

అమెరికాకు ఉన్న అతిపెద్ద సైనిక స్థావరం. ఖతార్ రాజధాని దోహాకు వెలుపల ఉన్న ఈ స్థావరంలో సుమారు 10వేల మంది అమెరికన్ సైనికులు ఉన్నట్టు అంచనా. పశ్చిమాసియా ప్రాంతంలో తన సైనిక వ్యవహారాలకు ఈ కేంద్రం అమెరికాకు ఎంతో కీలకమైనది.దోహా సమీపంలో భారీ పేలుళ్ల శబ్దాలు వెలువడినట్టు ప్రత్యక్ష సాక్షులను ఉటంకిస్తూ రాయిటర్స్, ఏఎఫ్‌పీ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. దీంతో ఖతార్ తన గగనతలాన్ని మూసివేసింది. సురక్షిత స్థానాలకు వెళ్లిపోవాలని అమెరికా, బ్రిటన్‌లు ఖతార్‌లోని తమ పౌరులకు సూచించాయి. మరోవైపు ఇరాక్‌లోని అయిన్ అల్ అసద్ బేస్‌పైనా ఇరాన్ రాకెట్లు ప్రయోగించింది. అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ప్రతిష్ఠంభన నేపథ్యంలో ఈ దాడులు ప్రమాదకరమైన మలుపుగా నిపుణులు భయాందోళనలు వ్యక్తంచేస్తున్నారు. ఈ యుద్ధం పశ్చిమాసియా అంతటా విస్తరించే అవకాశం ఉన్నదని ఆందోళన చెందుతున్నారు. ఆదివారం తెల్లవారు జామున తమ అణు కేంద్రాలపై అమెరికా దాడి చేసిన వెంటనే దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ప్రకటించింది. అందులో భాగంగానే అమెరికా సైనిక స్థావరంపై క్షిపణి దాడికి పాల్పడింది. అయితే ఇది మొదటి దాడి మాత్రమేనని ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. తమ అణుకేంద్రాలపై దాడికి అమెరికా ఎన్ని బాంబులను ఉపయోగించిందో తాము కూడా తమ ప్రతీకార దాడిలో అదే సంఖ్యలో బాంబులను ఉపయోగించామని ఇరాన్ జాతీయ భద్రతా మండలి తెలిపింది. ఇదిలా ఉండగా, ఇరాన్ ప్రతీకార చర్యల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితిని పర్యవేక్షించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెంటనే సిట్యుయేషన్ రూమ్‌కు చేరుకున్నట్టు వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. ఆయనతోపాటు రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, సైనిక దళాల ముఖ్యుల చైర్మన్ జనరల్ డాన్ కెయిన్ కూడా ఉన్నట్టు తెలిపాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మాస్కోలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కలుసుకున్న అనంతరం ఈ దాడులు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# పాక్ విమానాలకు గగనతల నిషేధం పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)



జూలై 24 వరకు నిషేధం కొనసాగుతుందని తెలిపింది. పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంతో పాక్ ఏప్రిల్ 24న గగనతల నిషేధాన్ని విధించి

# సంపాదకీయం

## అమెరికా యుద్ధచర్యను ఖండించాలి!

ఇరాన్ అణుకేంద్రాల మీద బి2 బాంబర్లతో దాడిచేసిన అమెరికా దుశ్చర్యను యావత్ సభ్య సమాజం ఎలుగెత్తి ఖండించాల్సిన అవసరం ఉంది. ఈ చర్య ఏ విధంగా చూసినప్పటికీ అన్ని చట్టాలు, సాంప్రదాయాలు, సార్వభౌమత్వాలను హరించేదిగా ఉన్నందున యుద్ధ నేరాల కింద విచారించాలి. ఒక దేశం అణుకార్యక్రమం కలిగి ఉండాలా లేదా అన్నది దానికి సంబంధించిన అంశం. ఇరాన్ అణుకార్యక్రమం నుంచి వైదొలిగితే దానికి తగిన విధంగా పరిహారం లేదా మరొకవిధంగా లబ్ధిచేకూర్చుతామని 2015లో ఒప్పందం చేసుకున్నది అమెరికా. దాన్నుంచి ఇదే డోనాల్డ్ ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 2018లో ఏకపక్షంగా వైదొలిగింది కూడా అమెరికానే. ఆ కారణంగానే ఇరాన్ తన అణుకార్యక్రమాన్ని కొనసాగిస్తున్నది. ఏ విధంగా చూసినప్పటికీ అది సమర్ధనీయమే. ఒక వేళ చట్టవిరుద్ధం అనుకుంటే దానికి ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి, ఇతర సంస్థలున్నాయి. వాటిలో చర్చ జరగాలి. దోషం ఏదైనా ఉంటే అక్కడ తేల్చాలి తప్ప దాడి చేయటానికి ఇజ్రాయిల్‌కు, దానికి సమర్ధనగా బాంబులు వేసేందుకు అమెరికాకు ఉన్న హక్కేంటి? ఈదాడిలో అణుకేంద్రాలు ధ్వంసమయ్యాయా లేదా అన్నది వేరే అంశం. అసలు దాడి చేయటానికి అదెవరు?

తమపై అమెరికా దాడికి పూనుకుంటే ప్రతి చర్యలు ఉంటాయని ఇరాన్ ముందునుంచే హెచ్చరించింది. అయితే ఇది రాసే సమయానికి ఇరాన్ వైపు నుంచి ఇజ్రాయిల్ మీద కొనసాగుతున్న క్షిపణి దాడులు తప్ప అమెరికా సైనిక స్థావరాలు లేదా మధ్యధరా సముద్రంలో, ఇతర చోట్ల ఉన్నదాని యుద్ధ నౌకల మీద గానీ ఎలాంటి దాడులు జరిగినట్లు వార్తలు లేవు. ఇరాన్ మీద అమెరికా దాడితో ఇరానీయన్లు భయభ్రాంతులకు గురైతే ఇరాన్ చేసిన హెచ్చరికతో ప్రపంచంలో ఉన్న ప్రతి అమెరికన్ తమకు ఎప్పుడేం జరుగుతుందో అని వణికి పోతున్నారు. కడుపు మండిన వారు ఎప్పుడేం చేస్తారో తెలియదు. బాధ్యతారహితమైన ట్రంప్ దుశ్చర్య అమెరికన్లను ప్రమాదంలోకి నెట్టింది. ఈ చర్యకు నిరసనగా అమెరికాలో కొన్ని చోట్ల వ్యతిరేక ప్రదర్శనలు జరిగినట్లు వార్తలు. రెండవ ప్రపంచ యుద్ధం చివరిలో ఓడిపోయి చేతులెత్తేసిన జపాన్‌పై అణుబాంబులు వేసిన అమెరికా చర్య దాన్ని దెబ్బతీయటానికి కాదు, తన దగ్గర ఎలాంటి ప్రమాదకర ఆయుధం ఉందో చూపి యావత్ ప్రపంచాన్ని తనకు దాసోహం చేసుకొనే దుష్టయత్నం.

ఈ రోజు అణుకార్యక్రమం గురించి తాను చెప్పినట్లు వినలేదని బాంబులు వేసిన అమెరికా, రేపు మరొక దేశం మరొక కారణంతో తనకు లొంగకపోతే ఇదే విధమైన దుర్మార్గానికి పాల్పడదనే నమ్మకం ఏముంది? కొన్ని దేశాలనైనా భయపెట్టేందుకు అమెరికా చేసిన దాడి తప్ప మరొకటి కాదు. నాడు అణుబాంబులు చూసి ప్రపంచాన్ని బెదిరిస్తే తర్వాత సోవియట్, చైనా, తదితర దేశాలన్నీ అణుబాంబులను సమకూర్చుకున్న కారణంగానే అమెరికా అదుపులో ఉంది. మనదేశం కూడా అణుపరీక్షలు జరపరాదని అమెరికా బెదిరించింది. అయితే సోవియట్‌తో ఉన్న రక్షణ ఒప్పందం, తదితర కారణాలతో అది ఇరాన్ మాదిరి దాడుల దుస్సాహసానికి పూనుకోలేదు. అయితే మనమీద ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అంతేకాదు అంతరిక్ష రంగంలో మనం కూడా ఎక్కడ పోటీకి వస్తామో అన్న ఉక్రోషంతో ఆ కార్యక్రమం, ప్రయోగాలను కూడా అడ్డుకొనేందుకు చూసింది. మనదేశాన్ని లొంగదీసుకొనేందుకు కాశ్మీరు, పంజాబ్, ఈశాన్య ప్రాంతంలో ఉగ్రవాదులను రెచ్చగొట్టి తలనొప్పులు కలిగించింది. పశ్చిమాసియాలో ఇరాన్‌ను లొంగదీసుకొనేందుకు, చమురు సంపదను కొల్లగొట్టేందుకు అక్కడ ఏర్పాటు చేసిన తొత్తు పాలకులనో తోసిపుచ్చి జనం కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దానికి లౌకికశక్తులు నాయకత్వం వహిస్తు న్నాయా? మతశక్తులా అన్నది వారి అంతర్గత వ్యహారం. జనమే తేల్చుకోవాల్సిన అంశం. మతశక్తులే అనుకుంటే వారి నాయకత్వంలో ఉన్న ప్రభుత్వంతోనే కదా అమెరికా అణు ఒప్పందం కుదుర్చుకున్నది, వైదొలగిందన్నది మరచిపోరాదు. అనేక దేశాల్లో నియంతలు పాలకులుగా ఉన్న దేశాలను అమెరికా సమర్ధించింది, మద్దతు ఇచ్చింది. అమెరికా దాడులు చేసినా తమ అణుకార్యక్రమం కొనసాగుతుందని ఇరాన్ ప్రకటించింది. అమెరికా దుర్మార్గాన్ని ఖండించటంలో ఐరాస, చైనా, రష్యా ముందున్నాయి. ప్రపంచ విశ్వగురువును తానే అనుకుంటున్న మనదేశం ఇంతవరకు నోరుమెదపలేదు. గాజాలో ఇజ్రాయిల్ మారణకాండను ఆపివేయాలన్న ఐరాస సాధారణ అసెంబ్లీ తీర్మానానికి మద్దతు ఇవ్వకుండా ఓటింగ్‌ను బహిష్కరించినపుడే మనమీద ఎవరి ఒత్తిడి పని చేస్తున్నదో తేలిపోయింది, ఇప్పుడు ఇరాన్‌పై జరిపిన అమెరికా దాడిని ఖండించగలదని ఎవరైనా ఎలా ఆశించగలరు?

# ఉపఎన్నికల్లో బిజెపికి ఎదురుదెబ్బ

**-ఒక స్థానానికే పరిమితం**
**--గుజరాత్‌లో ఆప్**
**-బెంగాల్‌లో టిఎంసి**
**-కేరళలో యుడిఎఫ్ గెలుపు**



న్యూఢిల్లీ,ప్రజా స్వేచ్ఛ
నాలుగు రాష్ట్రాల్లోని ఐదు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపికి ఎదురుదెబ్బ తగిలింది. గుజరాత్‌లో రెండు అసెంబ్లీ స్థానాలకు, పంజాబ్, పశ్చిమ బెంగాల్, కేరళలో ఒక్కొక్క అసెంబ్లీ స్థానానికి ఈ నెల 19న ఉప ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. వీటి ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. అధికారంలో ఉన్న పంజాబ్‌లోని అసెంబ్లీ స్థానంతో పాటు, గుజరాత్‌లో ఒక స్థానాన్ని ఆప్ కైవసం చేసుకుంది. గుజరాత్‌లో ఒక స్థానంతో బిజెపి సరిపెట్టుకుంది. పశ్చిమ బెంగాల్‌లో స్థానాన్ని అధికార టిఎంసి నిలబెట్టుకుంది.

**నీలంబుర్‌లో యుడిఎఫ్ గెలుపు**

కేరళలోని నీలంబుర్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ప్రతిపక్ష యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) అభ్యర్థి ఆర్యదాన్ షౌకత్ 11,077 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఎల్‌డిఎఫ్ అభ్యర్థి ఎం.స్వరాజ్‌కు 66,607 ఓట్లు రాగా, యుడిఎఫ్ అభ్యర్థికి 77,737 ఓట్లు వచ్చాయి. యుడిఎఫ్ అభ్యర్థికి జమాత్ ఇ ఇస్లామి, ఇతర వామపక్ష వ్యతిరేక సంఘాలు, సంస్థలు బహిరంగంగానే మద్దతునిచ్చాయి. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో యుడిఎఫ్‌కు 78,527 ఓట్లు వచ్చాయి. ఎల్‌డిఎఫ్ మద్దతు కలిగిన ఎంఎల్‌ఎ పివి అన్వర్ ఈ ఏడాది జనవరిలో రాజీనామా చేశారు. ఆ కారణంగా నీలంబుర్‌లో ఉప ఎన్నిక అవసరమైంది. టిఎంసి మద్దతుతో పివి అన్వర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయగా 19,780 ఓట్లు లభించాయి. మతోన్మాద అంశాలపై రాజీ పడకుండా అత్యంత ధైర్యంగా ఈ ఎన్నికలను ఎదుర్కొన్న ఎల్‌డిఎఫ్, జమాతె ఇ ఇస్లామితో సహా తీవ్రవాద సంస్థల ఓట్లను ఆమోదించబోమని ప్రకటించింది. మితవాద శక్తులు సాయపడినప్పటికీ యుడిఎఫ్‌కు దాదాపు రెండు వేల ఓట్లు తగ్గిపోయాయి. పోలింగ్ ముగిసిన వెంటనే బిజెపి అభ్యర్థి మోహన్ జార్జి మాట్లాడుతూ, బిజెపి కార్యకర్తల్లో చాలామంది యుడిఎఫ్‌కు అనుకూలంగా ఓటు వేశారని అంగీకరించారు. తమ ఓట్లలో కూడా ప్రధాన భాగం యుడిఎఫ్‌కు బదిలీ అయిందని ఎస్‌డిపిఐ (ముస్లిం ఛాందసవాద సంస్థ పాపులర్ ఫ్రంట్ రాజకీయ విభాగం) తెలిపింది. వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో, నీలంబుర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎల్‌డిఎఫ్ ఓట్లు 29,911గా వుండగా, ఈ ఎన్నికల్లో గణనీయంగా పెరగడం విశేషం.

**గుజరాత్‌లో బిజెపికి ఒక స్థానంలో ఓటమి**

అధికారంలో ఉన్న గుజరాత్‌లో రెండు స్థానాలకు ఉప ఎన్నికలు జరిగినా ఒక స్థానంలోనే గెలవడం, అది కూడా సానుభూతి ఓట్లతో గట్టెక్కడం బిజెపికి ఎదురుదెబ్బగానే విశ్లేషకులు భావిస్తున్నారు. 2022 ఎన్నికల్లో కడి నుంచి విజయం సాధించిన బిజెపి ఎమ్మెల్యే కర్సాన్ సోలంకి మరణంతో ఉప ఎన్నికలు జరగ్గా, ఆ పార్టీ అభ్యర్థి రాజేంద్ర చావ్డ కాంగ్రెస్ అభ్యర్థి రమేష్ చవ్డపై 39 వేల ఓట్ల తేడాతో గెలుపొందారు. విసావదర్‌లో ఆప్ అభ్యర్థి గోపాల్ ఇటాలియా బిజెపి అభ్యర్థి కిరిట్ పటేల్‌పై 17 వేలకు పైగా ఓట్లతో విజయం సాధించారు. ఈ స్థానంలో 2022 ఎన్నికల్లో గెలిచిన ఆప్ ఎమ్మెల్యే భూపేంద్ర భయానీ బిజెపిలో చేరడంతో ఇక్కడ ఎన్నికలు జరపాల్సి వచ్చింది. పంజాబ్‌లో లుధియానా వెస్ట్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ఆప్ అభ్యర్థి, ప్రస్తుత రాజ్యసభ ఎంపి సంజీవ్ అరోడా కాంగ్రెస్ అభ్యర్థి భరత్ భూషణ్ ఆషుపై 10 వేలకు పైగా ఓట్లతో విజయం సాధించారు. పశ్చిమ బెంగాల్‌లోని కాళీగంజ్ అసెంబ్లీ స్థానంలో టిఎంసి అభ్యర్థి అలీఫ్ అహ్మద్ కాంగ్రెస్ అభ్యర్థి కబీల్ ఉద్దీన్ షేక్‌పై 32 వేల ఓట్ల తేడాతో గెలుపొందారు. గత ఎన్నికల్లో విజయం సాధించిన నసీరుద్దీన్ అహ్మద్ మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహించారు. గుజరాత్‌లో రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్ ఓటమి పాలవడంతో ఆ రాష్ట్ర పిసిసి చీఫ్ శక్తిసిన్హా గోహిల్ తన పదవికి రాజీనామా చేశారు.

# బనకచర్లపై వెనక్కితగ్గం

**-గోదావరిలో ఒక్క చుక్క నీటిని వదులుకోం**
**-కేంద్రం వద్ద అవే వాదనలు వినిపిస్తాం**
**- రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు అన్ని చర్యలు**
**-కోర్టు తీర్పు ప్రకారం స్థానిక ఎన్నికలు**
**- చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు త్రిబుల్‌ఆర్‌కు ఆమోదం**
**- తెలంగాణ స్పోర్ట్స్ పాలసీకి ఆమోదం**
**- క్రీడా రిజర్వేషన్లు, పారితోషికాలు పెంపు**
**-కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాలు**
**- కాళేశ్వరం కమిషన్‌కు మినిట్స్‌తో కూడిన సమాచారం**
**- రాష్ట్రవ్యాప్తంగా రైతుభరోసా విజయోత్సవాలు : మంత్రివర్గ నిర్ణయాలు వెల్లడించిన మంత్రులు**



హైదరాబాద్-ప్రజా స్వేచ్ఛ
"గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో వెనక్కి తగ్గం. చట్టబద్ధంగా రాష్ట్రానికి రావాల్సిన ఒక్క నీటి చుక్కను కూడా వదిలిపెట్టం. ఈ మేరకు జులై మొదటి వారంలో కేంద్రం వద్ద జరిగే చర్చల్లో బలమైన వాదనలు వినిపించాలి" అని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయిం చింది. అలాగే కాళేశ్వరం అవినీతిపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ అడిగిన సమాచారాన్ని నిర్దేశిత గడువులోగా అందించేందుకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆ వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి మీడియాకు వివరించారు. గత బీఆర్ఎస్ సర్కార్ 2016లో అపెక్స్ కమిటీలో 400 టీఎంసీలను లిఫ్ట్ చేయడానికి ఏపీకి అనుమతి ఇచ్చిందనీ, వాస్తవాలను పక్కన పెట్టి బనకచర్ల బంకను తమ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని మంత్రులు చెప్పారు. ఈ ప్రాజెక్టు విషయంలో చట్టపరంగా, న్యాయపరంగా ముందుకెళ్లాలని మంత్రివర్గం నిర్ణయించింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఈనెల 30లోపు కమిషన్‌కు మినిట్స్‌తో సహా పూర్తి వివరాలు ఇవ్వాలని నిర్ణయించారు. 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా నూతన క్రీడా పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. క్రీడా కోటాలో రిజర్వేషన్లు పెంచాలని, క్రీడాకారులను ప్రోత్సహించేలా పారితోషికాలు ఇవ్వాలని నిర్ణయించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201కి.మీ., మేర త్రిబుల్ ఆర్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంగళవారం నాటికి రైతులందరికీ రైతుభరోసా పూర్తవుతుందనీ, 9 రోజుల్లో రూ. 9 వేల కోట్ల మొత్తాన్ని రైతులకు అందజేశామని మంత్రులు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద రైతుల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని మంత్రులు తెలిపారు. అలాగే అన్ని మండల కేంద్రాల్లోనూ పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బనకచర్లపై చర్చలకు ఏపీ సీఎం చంద్రబాబునాయుడిని ఆహ్వానించాలనే అంశం మంత్రివర్గంలో ప్రస్తావనకు రాలేదని సమాచారం.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాలను నవంబర్ 9న ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించేందుకు గతంలో రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులతో రెండు కమిటీలను ఏర్పాటు చేశారనీ, ప్రస్తుతం ఆ కమిటీల స్థాయిలో చర్చలు జరపాలని మంత్రివర్గం నిర్ణయించింది. అలాగే ప్రతి నెలా రెండు సార్లు మంత్రివర్గ సమావేశం జరపాలని తీర్మానించారు. కేంద్ర ప్రభుత్వ నిర్దేశిత విజన్ 2047 కు అనుగుణంగా రాష్ట్రం ప్రభుత్వం తన లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ముందుకెళ్లాలనీ, దానికోసం సలహా మండలి ఏర్పాటు చేయాలని మంత్రివర్గంలో నిర్ణయించారు. డిసెంబరు 9న తెలంగాణ రైజింగ్ 2047 విజన్ పాలసీని ఆవిష్కరించాలని నిర్ణయించారు. మహబూబ్‌నగర్‌లో బాసర త్రిబుల్‌ఐటీ క్యాంపస్ ఏర్పాటు, హుస్నాబాద్‌లో శాతవాహన యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపినట్టు వివరించారు. క్యాన్సర్‌పై అవగాహన కోసం ఆ రంగంలో ప్రముఖ వైద్యులు నోరి దత్తాత్రేయుడిని సలహాదారుగా నియమించాలని నిర్ణయించారు. సంగారెడ్డి జిల్లాలో రెండు కొత్త మున్సిపాల్టీలు ఏర్పాటు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ అప్‌గ్రేడ్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. స్థానిక సంస్థల ఎన్నికల అంశం కోర్టు పరిధిలో ఉందనీ, కోర్టు తీర్పు ప్రకారం నడుచుంటామని తెలిపారు.

## 'స్థానిక' ఎన్నికలపై

# హైకోర్టులో విచారణ..!!







తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**ఎన్నికలైనా పెట్టండి లేదా పాత సర్పంచ్లనైనా కొనసాగించాలని కోర్టుకెళ్లిన నల్గొండ జిల్లా మాజీ సర్పంచ్లు**

**-గత డిసెంబర్ 23న వాయిదా ఉండగా.. హియరింగ్కు రాని ఫైల్**

**ఆరు నెలల తర్వాత బెంచ్ ముందుకు కేసు.. కోర్టు నిర్ణయంపై ఉత్కంఠ**

హైదరాబాద్,స్థానిక సంస్థల ఎన్నికల అంశం సోమవారం హైకోర్టు బెంచ్ముందుకు రానుంది. గత ఏడాది డిసెంబర్ 23న 'స్థానిక' ఎన్నికల కేసు బెంచ్ ముందుకు రావాల్సి ఉండగా.. ఆ రోజు ఫైల్ రాలేదు. దీంతో అప్పటి నుంచి కేసు పెండింగ్లోనే ఉంది. దీనికి సంబంధించి కనీస ప్రస్తావన కూడా రాలేదు. సరిగ్గా ఆరు నెలల తర్వాత ఈ నెల 23న ఈ కేసు అనూహ్యంగా తెరపై వస్తుండడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అసలు ఎన్నికలపై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నది. ప్రభుత్వానికి ఎలాంటి ఆదేశాలు జారీ చేయనున్నదానిపై ఆసక్తి నెలకొంది.

**స్థానికం'పై కోర్టు ఆశ్రయించిన ఇద్దరు మాజీ సర్పంచ్లు**

తెలంగాణలో సర్పంచ్ల పదవీ కాలం 2024 ఫిబ్రవరి 1వ తేదీతో ముగిసింది. ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం 2024 జులై 5తో పూర్తయింది. ఆరు నెలలలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా.. ప్రభుత్వం జాప్యం చేస్తూ వచ్చింది. రాజ్యాంగ ప్రకారం ఆరు నెలలలోపు లేదా ఆరు నెలల ముందైనా నిర్వహించాల్సి ఉంది. ఈ నేథ్యంలో నల్గొండ జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ సర్పంచ్లు స్థానిక ఎన్నికలపై కోర్టును ఆశ్రయించారు. స్థానిక ఎన్నికలైనా నిర్వహించండి.. లేదా పాత సర్పంచులనైనా కొనసాగించాలని పిటిషన్లో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కోర్టు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇటు ప్రభుత్వం తరఫున న్యాయవాదులు, అటు మాజీ సర్పంచ్లు న్యాయవాదులు బలంగా వాదనలు వినిపించారు. దీంతో ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో తేల్చిచెప్పాలని ప్రభుత్వాన్ని కోరింది. జాప్యం జరగడానికి కారణాలు తెలపాలని, డిసెంబర్ 23 వరకు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. ఈ క్రమంలో చీఫ్జస్టిస్ ముందుకు బీసీ కమిషన్, రిజర్వేషన్ ప్రక్రియకు సంబంధించిన కేసు రావడంతో మాజీ సర్పంచ్లు వేసిన కేసుపై కదలిక రాలేదు. ఆరు నెలల తర్వాత మళ్లీ మాజీ సర్పంచ్ల కేసు బెంచ్మీదకు రానుండడంతో 'స్థానిక' ఎన్నికలపై కోర్టు ఎలాంటి తీర్పు వెలువరించనున్నదనే ఆసక్తిగా మారింది. గతంలో ఈ కేసు విచారణ30వ కోర్టు జడ్జి శరత్ ఆధ్వర్యంలో కొనసాగగా.. సోమవారం ఈ ఫైల్ 10వ కోర్టు జడ్జి మాధవి ముందుకు రానున్నట్లు సమాచారం.

**ఎన్నికలకు సన్నద్ధమవుతున్న సర్కార్**

స్థానిక ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సమయాత్తమవుతున్నది. ఇప్పటికే పంచాయతీరాజ్ అధికారులు ఎన్నికల సంబంధించిన వర్క్ పూర్తి చేశారు. వార్డుల వారీగా ఓటరు జాబితా రూపొందించారు. పోలింగ్ స్టేషన్ల గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యింది. సిబ్బంది, అధికారులకు ఎన్నికల సంబంధించి శిక్షణ కూడా ఇచ్చారు. బ్యాలెట్ బాక్సు, బ్యాలెట్ పేపర్లు రెడీ చేశారు. ప్రభుత్వం నుంచి ఎప్పుడు ప్రకటన వచ్చిన ఎన్నికల నిర్వహించేలా పంచాయతీరాజ్ శాఖ గ్రౌండ్ ప్రిపేరు చేసింది.ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల లెక్కతేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియ తుది దశకు చేరుకున్నది. గతంతో పోలిస్తే ఈ సారి ఎంపీటీసీ స్థానాల సంఖ్య తగ్గే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. రిజర్వేషన్ల అంశంపై కూడా ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ప్రభుత్వానికి అనుకూలంగా మారడంతో ఎన్నికల నిర్వహణకు ఇదే మంచి సమయమని భావిస్తున్నట్లు సమాచారం.

# జులై 9న జాతీయ ఉద్యోగ కార్మికుల సమ్మెను విజయవంతం చేద్దాం

**నారాయణపేట జిల్లా, ప్రజా స్వేచ్ఛ...**



కార్మికులకు నష్టం కలిగించే నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయాలని కార్మిక చట్టాలను రక్షించాలని కోరుతూ జులై 9 దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జరగనున్నదని సిఐటియు జిల్లా కార్యదర్శి బల్ రామ్ తెలిపారు. సోమవారం రోజు నారాయణపేట జిల్లా విద్యాధికారి గోవిందరాజుకు గారికి మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు డి.ఆర్.డి.ఓ మొగులప్ప గారికి క్షేత్ర సహాయకుల సంఘం ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు అందజేశారు .ఈ సందర్భంగా CITU జిల్లా కార్యదర్శి బాల్ రాం,, మధ్యాహ్న బోజన కార్మిక సంఘం జిల్లా అద్యక్షులు జయంతి ఉపాధి హామీ క్షేత్ర సహాయకుల సంఘం రాష్ట్ర నాయకులు బి కాశీనాథ్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించి అమలు చేయాలని ఉద్యోగ భద్రత పిఎఫ్ ఈఎస్ఐ ఈ చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు .జిల్లా వ్యాప్తంగా జరిగే సమ్మెలో నారాయణపేట జిల్లాలో కూడా మధ్యాహ్న భోజన కార్మికులు క్షేత్రస్థాయికులు పాల్గొంటున్నారని తెలిపారు కార్మికులకు నష్టం కలిగించే విధానాలను పాలకులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ వినతి పత్రం అందజేసిన వారిలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యాదమ్మ జిల్లా నేతలు విజయలక్ష్మి సరళ, జ్యోతి ,ఉపాది హామీ క్షేత్రం సహాయకుల సంఘం జిల్లా నాయకులు భీమ్షప్ప, ప్రసాద్, నర్వ వెంకటేశం, కాంతరాజ్ నరేష్ , నాగేషు తదితరులు పాల్గొన్నారు

# డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా స్మారక శ్రద్ధాంజలి

**నకిరేకల్ ,ప్రజా స్వేచ్ఛ**



డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా నకిరేకల్ భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు గరే మురళి మోహన్ ఆధ్వర్యంలో నకిరేకల్ మెయిన్స్ సెంటర్ నందు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగినది ఇట్టి కార్యక్రమంలో నకిరేకల్ మండల అధ్యక్షులు బుడిగ సైదులు జిల్లా ఉపాధ్యక్షులు మండల వెంకన్న జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి గురుగుంట్ల సాయన్న మరియు అందాల సైదులు సీనియర్ నాయకులు జిల్లా కాకయ్య కొండేటి శ్రీను భువనగిరి వెంకటేశ్వర్లు నల్లగంటి వెక్కి నడికుడి సైదులు నారవాణి వెంకటేశ్వర్లు సింథోజు ఉపేంద్ర చారి ఉప్పల ఉప్పల నాగరాజు జగదీష్ నల్లగంటి విక్కి రామ్ మేడిపల్లి శివ బ్రహ్మదేవర రవిశంకర్ ఏర్పుల నరేష్ నవీన్ కుక్క కడప గోపయ్య మరియు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

**-జిల్లా ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ IPS గారు**



**నారాయణపేట జిల్లా ,ప్రజా స్వేచ్ఛ ...**

ఈరోజు ప్రజావాణి కార్యక్రమంలో బాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ IPS గారు బాధితుల నుండి 12 ఫిర్యాదులను స్వీకరించి వాటిని చట్టప్రకారం పరిశీలించవలసిందిగా CI, SI లకు సూచించారు. భూ తగాదాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న పోలీసు రెవెన్యూ అధికారులు సమన్వయంతో ఫిర్యాదులను పరిష్కరించాలని లేదా సామరస్యంగా మాట్లాడుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని, ఏలాంటి ఆవేశాలకు లోనుకారదు అని ఫిర్యాదుదారులకు ఎస్పీ గారు సూచించారు. బాధితులు తీసుకొవచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్లో ఉంచరాదని వాటిని వెంటనే చట్ట ప్రకారం పరిష్కరించాలని ఫోన్లో మాట్లాడి సంబంధిత అధికారులకు తెలిపారు. 07 ఫిర్యాదులు భూ తగదాలకు సంబంధించినవి రాగా, 03 ఫిర్యాదులు ఆస్తి తగాదాలకు సంబంధించి, 02 ఫిర్యాదులు ఫ్యామిలీ గొడవలకు సంబంధించి రావడం జరిగింది. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని, పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా, భద్రత కల్పించాలని సూచించారు. పోలీస్ అధికారులు సిబ్బంది పోలీస్ స్టేషన్కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వినతులు ఫిర్యాదులు స్వీకరించి క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని తద్వారా పోలీస్ శాఖ పై భరోసా నమ్మకం కలుగుతుందన్నారు. పోలీస్ స్టేషన్కు, ఇతర కార్యాలయాలకు వెళ్లే ఫిర్యాదుదారులు మధ్యవర్తులను తీసుకెళ్లరాదని స్వయంగా వెళ్లి సమస్యను ఫిర్యాదు ఇచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

# మహిళ సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించిన సిడిపిఓ చంద్రకళ

**దేవరకొండ:ప్రజా స్వేచ్ఛ ...**



దేవరకొండ పట్టణం లో గల కేజీబీవీ బాలికల పాఠశాలలో మహిళ సాధికారతపై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమవారము దేవరకొండ సిడిపిఓ చంద్రకళ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విద్యను నేర్చుకోవడం తప్పనిసరనీ, విద్య ద్వారానే అన్ని రంగాలలో ముందుకు వెళ్లగలుగుతామని సిడిపిఓ చంద్రక ల న్నారు . బాలికలు చదువుకుంటే భవిష్యత్తు బాగుంటుందని ప్రభుత్వం కస్తూర్బా పాఠశాలలు ఏర్పాటు చేసీ బాలికలకు అండగా ఉంటుందని అన్నారు. బాలికలకు తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేస్తే బాలికలకు ఎంతో నష్టం వాటిల్లుతుందని ఈ విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలని సిడిపిఓ బాలికల తల్లిదండ్రులకు సూచించారు. బాల్య వివాహాల వల్ల లాభాని కన్నా నష్టం ఎక్కువ అని, మేనరికపు వివాహల వల్ల పుట్టబోయే పిల్లలకు జరిగే పరిణామాలు సేఫ్ టచ్ అన్సేవ్ టచ్ న్యూట్రిషన్ లోపం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు పిల్లలకు ఎక్కువ అవుతాయని, పిల్లలు ఫోన్ ఉపయోగించడం వల్ల వచ్చే సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉంటాయని అలాంటప్పుడు హెల్ప్ లైన్ ఉపయోగించుకునే విధానం అందుబాటులో ఉందని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతనే కాకుండా మన చుట్టూ ఉన్న పరిసరాల పరిశుభ్రతను మొదలగు విషయాల గురించి సి డిపో బాలికలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ సునీత కవిత కేజీబీవీ స్కూల్ టీచర్స్ ఏఎన్ఎం విద్యావతి అంగన్వాడి టీచర్ ప్రభావతి పద్మావతి సుశీల ఆశా వర్కర్లు కిషోర్ బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ



**జగిత్యాల ,ప్రజా స్వేచ్ఛ...**

ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలో ఇటీవల మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సోమవారం భూమిపూజ జరిగింది. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు భూస రాజేశ్వర్, కనుక మురళి,జన లాస్మ మరియు మాజీ సర్పంచ్ లింగంపల్లి గంగాధర్ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జనశంకర్, సింగిల్ విండో డైరెక్టర్ ఎలక అశోక్ గౌడ్, కార్యదర్శి రవళి మరియు కాంగ్రెస్ నాయకులు దేశెట్టి జీవన్, దుద్దుల లింగన్న, భూస రమేష్, నరేష్, అబ్బూరి చిన్న మల్లేష్, వడ్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ హామీని నెరవేర్చేందుకు మొదటి అడుగుగా భూమిపూజ జరిగిందని అభిప్రాయపడ్డారు. నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేరే దిశగా ఈ కార్యక్రమం ప్రారంభమైందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## అవాజ్ కమిటీ రాష్ట్ర 3 వ మహా సభ కరపత్రం విడుదల


మైనార్టీల హక్కులను రక్షిద్దాము



ప్రజా స్వేచ్ఛ ...
జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అవాజ్ కమిటీ 3 వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని అయిజ పట్టణంలో కరపత్రాలు విడుదల చేయడం జరిగింది.అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మైనార్టీల సమస్యలైన 370 ఆర్టికల్ రద్దు, సి ఏ ఏ వక్ఫ్ సవరణ చట్టం, త్రిపుల్ తలాక్, క్రిమినలైజేషన్ వంటి చట్టాల ను చర్చించడం జరుగుతుంది. బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఆర్ ఎస్ ఎస్, వీ ఎచ్ పి వంటి హిందుత్వ మతోన్మాదుల నుండి మైనార్టీలపై మూక దాడులు, గో రక్షణ పేరుతో ఆకారణంగా దాడులు, వారి హక్కులను హరించడం ను ఖండిస్తున్నాము.భారత దేశం లో అగ్రవర్ణ ఆధిపత్య హిందుత్వ పాలకులు మైనార్టీ మతస్తులను ఆగౌరవపరచడాన్ని, ఆర్థికంగా అనగద్రోక్కడాన్ని ఖండిస్తున్నాము. రాజ్యాంగాన్ని వారి రాజ్యాంగ పర హక్కులను కాపాడాలి.అవాజ్ కమిటీకి గద్వాల జిల్లా అఖిలపక్ష కమిటీ,ప్రజా సంఘాలు, బహుజన సంఘాలు,వారి పట్ల నిలబడే బి ఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీలు మద్దతు తెలుపుతున్నాము.కనుక జులై 13,14 న గద్వాల్ పట్టణంలో జరిగే అవాజ్ కమిటీ రాష్ట్ర మహాసభలకు మైనార్టీ ప్రజలు, కార్మికులు, ప్రజ

## పేదల సొంతింటి కల నెరవేరుతున్న వేళ.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కృషి.



మహేశ్వరం, ప్రజా స్వేచ్ఛ ....
పేదల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బంగారు గల్ల లాజర్ అన్నారు. సోమవారం మహేశ్వరం గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇండ్లకు భూమి పూజ కార్యక్రమంలో శివగంగ దేవాలయ చైర్మన్ అల్లెకుమార్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల సొంతింటి కల సాకారమవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించవడమే ప్రజా ప్రభుత్వం యొక్క లక్ష్యం అని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రాజకీయాలకతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుజాత కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణ గంటి సుభాష్, కరోల్ల రాములు, రాజు నాయక్, ప్రవేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు



జగిత్యాల, ప్రజా స్వేచ్ఛ, ...
ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఓ ప్రత్యేక కార్యక్రమం జరిగింది. యువతను మత్తు వ్యసనాల నుంచి దూరం పెట్టేందుకు ఇబ్రహీంపట్నం పోలీస్ విభాగం ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా మెట్పల్లి సీఐ వి.అనిల్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.యువత మత్తుకి బానిసై తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. చెడు అలవాట్లతో పాటు, అలాంటి అలవాట్లు ఉన్నవాళ్ల సన్నిహితంగా ఉండటం కూడా ప్రమాదమే. మంచి క్రమశిక్షణతో చదువుకుంటూ, సమాజంలో మేలైన గుర్తింపు తెచ్చుకోవాలన్న లక్ష్యంతో ముందుకు సాగండి" అని సూచించారు.

# తెలంగాణలో భారీగా తగ్గబోతున్న ఎంపీటీసీ స్థానాలు..కారణమిదే..!!






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**తెలంగాణలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తుంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి..**

ప్రజా స్వేచ్ఛ ....
ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడమే ఆలస్యం అని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. జులై చివరి నాటికి లేదంటే ఆగస్టు మొదటి వారానికి.. స్థానిక సంస్థల్లో కొత్త పాలకమండలి కొలవు దీరనుందని అధికారులు చెబుతున్నారు. ఇక గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి అప్పుడే మొదలయ్యింది. ఇదిలా ఉంటే తాజాగా ఒక ఆసక్తికర వార్త ప్రచారం అవుతుంది. ఇంతకు అది ఏంటంటే.. తెలంగాణలో ఎంపీటీసీ స్థానాలు తగ్గబోతున్నాయట. ఆ వివరాలు..తెలంగాణ రాష్ట్రంలోని 566 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎలక్షన్ నిర్వహించేందుకు పంచాయత్ రాజ్ శాఖ రెడీ అవుతోంది. దీనికి సంబంధించి తుది జాబితా ఖరారు చేసింది. ప్రస్తుతం ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్ల అమలు వంటి అంశాలను ఓ కొలిక్కి తెచ్చే పనిలో బిజీగా ఉంది. దీనితో పాటుగా.. తెలంగాణలో ఎంపీటీసీల స్థానాల సంఖ్యను కూడా ఫైనల్ చేయనున్నారు అధికారులు. ఇప్పటి వరకు తెలంగాణలో 5,817 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఇప్పుడు ఆ సంఖ్య తగ్గనుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.తెలంగాణలో ఎంపీటీసీ స్థానాలు తగ్గనున్నాయిని అధికారులు తెలుపుతున్నారు. ఇటీవల రాష్ట్రంలో కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటు చేయడమే ఇందుకు కారణం అంటున్నారు. అంతేకాక కార్పొరేషన్ సమీపంలోని గ్రామాలను వాటిల్లోనే విలీనం చేశారు. దీంతో పాటుగా మేడ్చల్ జిల్లా మొత్తాన్ని అర్బన్ ప్రాంతంగా మార్చడమే కాక.. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి మండలాలన్నింటిని మున్సిపాలిటీలుగా మార్చారు. దీంతో ఎంపీటీసీ సభ్యుల సంఖ్య తగ్గనుందని అధికారులు తెలుపుతున్నారు.ఇదిలా ఉంటే 2019లో 32 జిల్లా పరిషత్ ఛైర్మన్లు, 539 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. కానీ ఈ సారి మాత్రం 31 జిల్లా పరిషత్, 566 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించబోతున్నారు. ఇక తాజా జాబితా ప్రకారం చూసుకుంటే రాష్ట్రంలో అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 33 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా.. ఆ తర్వాత స్థానంలో నిజామాబాద్ ఉంది. ఇక్కడ 31 జెడ్పీటీసీ స్థానాలున్నాయి.ఆ తర్వాత సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో 26, కామారెడ్డిలో 25 జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. అతి తక్కువ జెడ్పీటీసీ స్థానాలు ఉన్నది.. మంత్రి సీతక్క సారధ్యం వహిస్తోన్న ములుగు జిల్లాలో. ఇక్కడ కేవలం 10 జెడ్పీటీసీ స్థానాలే ఉన్నాయి. ఇక త్వరలోనే వీటికి ఎన్నికలు నిర్వహించేందుకు రెడీ అవుతున్నారు. అలానే స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా త్వరలోనే నోటిఫికేషన్ విడుదల కానుంది.

# మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దు

**-డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు కృషిచేయాలి: గోదావరిఖని ఏ సి పి ఎం రమేష్**

**-మొక్కలు నాటిన సెక్రెట్ హార్ట్ స్కూల్ విద్యార్థులు**

గోదావరిఖని, ప్రజా స్వేచ్ఛ...
విద్యార్థులు చెడు వ్యసనాలకు లోను కాకుండా చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని గోదావరిఖని ఏసిపి ఎం రమేష్ సూచించారు. ఈరోజు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన వారోత్సవాల్లో భాగంగా Heal your mind & plant a tree- Say no to drugs అనే నినాదం తో గురువారం గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సెక్రెడ్ హార్ట్ స్కూల్లో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో గంజాయి మత్తుపదార్థాల నియంత్రణ పై



విద్యార్థులకు అవగాహన మరియు పిల్లలతో మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో మాట్లాడుతూ... విద్యార్థి దశ నుండే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని లక్ష సాధన దిశగా అడుగులు వేయాలని, విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని, మత్తు పదార్థాలైన గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు తీసుకుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలకు చేరుకుని తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తేవాలని సూచించారు. మీ కాలనీ, మీ చుట్టూ ప్రక్కల ప్రాంతం లో ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లయితే పోలీస్ దృష్టికి తీసుకురావాలన్నారు. సమాచారం అందించిన వివరణ గోపిగా ఉంచబడుతుందన్నారు.ఎసిపి, సీఐ, ఎస్సైలు విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి,ఎస్సై రమేష్, భూమేష్, పోలీస్ సిబ్బంది, టీచర్స్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# వెల్దండలో విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

**-విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులకు నోటుబుక్స్, పెన్సిల్స్**




వెల్దండ,ప్రజా స్వేచ్ఛ...
వెల్దండ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల (ఎంఆర్‌సీ) విద్యార్థులకు హైదరాబాద్ విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ఉచితంగా నోటుబుక్స్, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. విద్యా ప్రేరణకు తోడ్పడే ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆనందాన్ని నింపింది.ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ వాసుదేవ్ రావు మాట్లాడుతూ, "మా సంస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 31 ప్రభుత్వ పాఠశాలల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నోటుబుక్స్‌తో పాటు పాఠశాలలకు అవసరమైన ప్రాజెక్టర్లు, క్రీడా పరికరాలు కూడా అందిస్తున్నాం" అని తెలిపారు. వెల్దండ ఎంఆర్‌సీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల కృషిని గుర్తించి ఈ ఏడాది 150 మంది విద్యార్థులకు విద్యా సామాగ్రి అందించామని పేర్కొన్నారు.పాఠశాల హెచ్‌ఎం శ్రీమతి పావని మాట్లాడుతూ, "మా విద్యార్థులకు సహాయం చేయడానికి ముందుకు వచ్చిన ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం" అని అన్నారు.ఈ కార్యక్రమంలో తాండ్ర పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సుగుణ, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనాథ్, సంతోషి రాణి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# ఊరటనిచ్చిన బంగారం..

### హైదరాబాద్‌లో తులం ధర ఎంత తగ్గిందో తెలుసా..?

బంగారం ధరలు కొనుగోలుదారులకు స్వల్ప ఊరటనిచ్చాయి. ఆభరణాల వ్యాపారులు, స్టాకిస్టులు అమ్మకాలు జరుపడంతో ధరలు దిగివచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో ధరలు పతనమయ్యాయి. 24 క్యారెట్స్ గోల్డ్‌పై రూ.160 తగ్గింది. దీంతో తులం ధర రూ.99,800కి చేరింది. అదే సమయంలో 22 క్యారెట్స్ పసిడి రూ.150 తగ్గి.. తులానికి రూ.99,100కి తగ్గింది. అదే సమయంలో వెండి ధర స్థిరంగా కొనసాగుతున్నది. కిలో వెండి ధర రూ.1,05,200 పలుకుతున్నది ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. మరో వైపు గ్లోబల్ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు స్వల్పంగా తగ్గి.. 3,365.40 పడిపోయింది. సోమవారం ధరలు పెరిగినా.. ఆ తర్వాత తగ్గాయని కోటక్ సెక్యూరిటీస్‌లోని కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కైనత్ చైన్వాలా తెలిపారు.టెహ్రాన్‌పై వాషింగ్టన్ దాడులకు దిగడంతో పెట్టుబడిదారులు ఇరాన్ ఎలా



స్పందిస్తుందో వేచి చూస్తున్నారు. కీలకమైన పరిస్థితులను పెట్టుబడిదారులు నిశితంగా పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. యూఎస్ ఫెడరల్ బ్యాంక్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగం, యూఎస్ జీడీపీ డేటా, కోర్ పర్సనల్ కంజమ్షన్ ఎక్స్‌పెండేచర్ ఇన్‌ఫ్లమేషన్ డేటాపై పెట్టుబడిదారులు దృష్టి సారించారని చెప్పారు. ఫెడరల్ రిజర్వ్ నుంచి మిశ్రమ సంకేతాల మధ్య ద్రవ్య విధానం దిశపై కొత్త సూచనలు ఇచ్చే అవకాశం ఉన్నది. యూఎస్, యూకేతో సహా ప్రధాన ఆర్థిక వ్యవస్థల పీఎంఐ డేటా గ్లోబల్ ఫైనాన్స్ వెల్త్ గురించి కొత్త సూచనలు ఇస్తుందని కమోడిటీ మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. పీఎంఐ అంటే పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్. తయారీ-సేవా రంగం కార్యకలాపాలను కొలిచే ఆర్థిక సూచిక. ఫ్లాష్ పీఎంఐ అనేది నెలాఖరుకి కొన్ని రోజుల ముందు విడుదలయ్యే నివేదిక. ఎంకే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విశ్లేషకురాలు రియా సింగ్ ప్రకారం.. జూన్‌లో ఇప్పటివరకు దేశీయ బంగారం ధరలు 4శాతం పెరిగాయి. అయితే, బలహీనమైన డిమాండ్ కారణంగా ప్రపంచ ధరలు తగ్గుతున్నాయి. పండుగల షాపింగ్ సమయంలో మందగమనం ఉన్నప్పటికీ, గోల్డ్‌బార్స్, నాణేలకు, ముఖ్యంగా 10 గ్రాముల నాణేలపై పెట్టుబడులు డిమాండ్ బలంగా ఉంది. ద్రవ్యోల్బణ భయాలు, తక్కువ తయారీ ఖర్చులు దీనికి కారణమని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికి వస్తే.. 22 క్యారెట్స్ గోల్డ్ రూ.92,300 ఉండగా.. 24 క్యారెట్స్ గోల్డ్ రూ.1,00,690 పలుకుతున్నది. వెండి ధర విషయానికి వస్తే కిలోకు రూ.1.20లక్షలు పలుకుతున్నది.

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు.. నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ.. అగ్రరాజ్యం అమెరికా ఇరాన్‌లోని మూడు అణుకేంద్రాలపై మిస్సైళ్లతో విరుచుకుపడింది. అమెరికా దాడుల ప్రభావం మార్కెట్‌పై పడింది. మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. ఫలితంగా మార్కెట్లు పతనమయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,704.07 పాయింట్ల వద్ద సెన్సెక్స్ నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 82,169.67 పాయింట్ల గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యల్పంగా 81,476.76 పాయింట్లకు పడిపోయింది. చివరకు 511.38 పాయింట్ల నష్టంతో 81,896.79 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 140.50 పాయింట్లు తగ్గి 24,971.90 వద్ద స్థిరపడింది.ట్రేడింగ్‌లో దాదాపు 1,794 షేర్లు లాభపడగా.. మరో 2,113 షేర్లు పతనమయ్యాయి. ట్రెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్, హిందాల్కో ఇండస్ట్రీస్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, బజాజ్ ఫైనాన్స్ నిఫ్టీలో ప్రధానంగా లాభాలను ఆర్జించాయి. ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టీ, హీరో మోటోకార్ప్, ఎం అండ్ ఎం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఆటో, బ్యాంక్, టెలికాం 0.3 నుంచి 1.5 శాతం పతనమయ్యాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్, మీడియా, మెటల్, క్యాపిటల్ గూడ్స్ 0.3-4 శాతం పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.2 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం పెరిగాయి

# బస్ బుకింగ్స్‌లో 30 శాతం వృద్ధి

### రెడ్‌బస్ వెల్లడి

**హైదరాబాద్**

గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25లో తెలుగు రాష్ట్రాల్లో సమిష్టిగా బస్ బుకింగ్‌లో 30 శాతం వృద్ధి నమోదయ్యిందని ప్రముఖ ఆన్‌లైన్ బస్ బుకింగ్‌యాప్ రెడ్ బస్ వెల్లడించింది. హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-విజయవాడ, తిరుపతి-బెంగళూరు, విశాఖపట్నం-హైదరాబాద్ అత్యంత రద్దీగా ఉండే మార్గాల్లో ఉన్నాయని పేర్కొంది. ఇందులో హైదరాబాద్ ప్రధాన రవాణా కేంద్రంగా నిలిచిందని పేర్కొంది. 56 శాతం మంది ప్రయాణికులు ఒక్క రోజు ముందు బుకింగ్ చేసుకోగా.. 40 శాతం మంది 1-7 రోజులు ముందు బుకింగ్స్‌ను చేసుకున్నారని రెడ్‌బస్ సిఎంఒ పల్లవి చోప్రా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎల్లప్పుడూ ఇంటర్‌సిటీ ప్రయాణంలో ముందంజలో ఉన్నాయన్నారు.

redBus

# హెడింగ్లే టెస్టులో రాహుల్ శతక గర్జన..

### మ్యాచ్‌పై పట్టుబిగించిన భారత్..!


లీడ్స్‌లోని హెడింగ్లేలో జరుగుతున్న తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్(100 నాటౌట్) సెంచరీతో విజృంభించాడు. లంచ్ తర్వాత స్పీడ్ పెంచిన రాహుల్.. షోయబ్ బషీర్ బౌలింగ్‌ల్ రెండు రన్స్ తీసి శతకం పూర్తి చేసుకున్నాడు. దాంతో, డ్రెస్సింగ్ రూమ్ బాల్కనీ నుంచి టీమిండియా కెప్టెన్ గిల్ సహ ఆటగాళ్లంతా చప్పట్లు కొడుతూ రాహుల్‌ను అభినందించారు. రాహుల్ సెంచరీ, పంత్ హాఫ్ సెంచరీలతో కదం తొక్కగా భారత్ స్కోర్ 240 దాటింది.తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్‌ను ఆలౌట్ చేసి స్వల్ప ఆధిక్యం సాధించిన టీమిండియా.. మ్యాచ్‌పై పట్టుబించింది. ఓవర్‌నైట్ స్కోర్ 90/2తో నాలుగో రోజు బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆదిలోనే శుభ్‌మన్



గిల్(8) వికెట్ కోల్పోయింది. ఫామ్‌లో ఉన్న గిల్‌ను కార్సే బౌల్డ్ చేసి ఇంగ్లండ్‌కు బ్రేకిచ్చాడు. కానీ, ఆ తర్వాత వచ్చిన రిషభ్ పంత్( నాటౌట్) వచ్చిరాగానే బాదకుండా క్రీజులో కుదురుకోవడానికి ప్రాధాన్యమిచ్చాడు. అయితే అతడికి కార్సే ఓవర్లో లైఫ్ లభించింది. అనంతరం టంగ్ ఓవర్లో రాహుల్ స్లిప్‌లో కట్ షాట్ ఆడగా.. అక్కడే కాచుకొని ఉన్న హ్యారీ బ్రూక్ క్యాచ్ అందుకోలేకపోయాడు.స్టోక్స్ టీమ్ ఎంత ప్రయత్నించినా సరే రాహుల్, పంత్ వికెట్ ఇవ్వలేదు. నింపాదిగా ఆడిన వీళ్లు జట్టు ఆధిక్యాన్ని పెంచుతూ పోయారు. లంచ్ తర్వాత గేర్ మార్చిన పంత్ అర్ధ శతకం సాధించగా.. ఆ కాసేపటికే బషీర్ ఓవర్లో డబుల్స్ తీసి రాహుల్ సెంచరీ సంబురాలు చేసుకున్నాడు. స్టోక్స్ సేన బౌలింగ్ ఎత్తుల్ని చిత్తు చేస్తున్న ఈ ద్వయం ఇప్పటికే 152 పరుగుల భాగస్వామ్యంతో జట్టును పటిష్ట స్థితిలో నిలిపింది. ప్రస్తుతం టీమిండియా 251 పరుగుల ఆధిక్యంలో ఉంది.

## స్పోర్ట్స్

## హెడింగ్లేలో పంత్ 'డబుల్ టన్'.. తొలి భారతీయుడిగా రికార్డు..!..!




హెడింగ్లే టెస్టులో భారత క్రికెటర్లు సెంచరీల పండుగ చేసుకుంటున్నారు. ఇంగ్లండ్ బౌలర్లను సునాయసంగా ఎదుర్కొంటూ కేఎల్ రాహుల్ వంద కొట్టగా.. వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ (100 నాటౌట్) సైతం మూడంకెల స్కోర్ అందుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో సూపర్ సెంచరీ బాదిన పంత్.. రెండో ఇన్నింగ్స్‌లోనే శతకం బాదేశాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఈ ఫీట్ సాధించడం అతడికి ఇదే ప్రథమం. ఇంగ్లండ్‌పై ఒకే టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లో వంద కొట్టిన భారతీయుడిగా పంత్ రికార్డు సృష్టించాడు. మొత్తంగా ఈ ఘనతకు చేరువైన ఏడో ఇండియన్ క్రికెటర్‌గా రికార్డుపుటల్లో నిలిచాడీ హిట్టర్.భోజన విరామం తర్వాత గేర్ మార్చిన పంత్ పేసర్ జోష్ టంగ్ వేసిన తొలి ఓవర్లోనే వరుసగా రెండు ఫోర్లు బాదాడు. అనంతరం అతడి బౌలింగ్‌లోనే ఫోర్ కొట్టి.. డబుల్స్ తీసి ఫిఫ్టీ సాధించాడు. బషీర్‌కు చుక్కలు చూపిస్తూ లాంగాఫ్‌లో భారీ సిక్సర్ బాదాడీ చిచ్చరపిడుగు. రూట్ ఓవర్లో సింగిల్‌తో 99కు చేరిన ఈ డాషింగ్ బ్యాటర్.. బషీర్ బౌలింగ్‌లో సింగిల్ తీసి సెంచరీ సాధించాడు.

**గవాస్కర్ మూడు పర్యాయాలు**

పంత్ కంటే ముందు ఏడుగురు భారత ఆటగాళ్లు రెండు ఇన్నింగ్స్‌ల్లో వంద కొట్టారు. లెజెండ్ సునీల్ గవాస్కర్ ఏకంగామూడు పర్యాయాలు ఈ ఫీట్ సాధించగా.. 'వాల్' రాహుల్ ద్రవిడ్ రెండుసార్లు ఈ మార్క్ అందుకున్నాడు. మిగతా ఐదుగురిలో మాజీలు విజయ్ హజారే, విరాట్ కోహ్లీ, అజింక్యా రహానే, రోహిత్ శర్మ ఉన్నారు.

# ఎన్నో సెంచరీలు మిస్సయ్యాను


**కోల్‌కతా**

టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ.. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన మనోగతాన్ని వివరించారు. తన కెరీర్‌లో ఎన్నో సెంచరీలను చేసే అవకాశాలను మిస్ అయినట్లు పేర్కొన్నారు. వాస్తవానికి అంతర్జాతీయ క్రికెట్‌లో గంగూలీ 38 సెంచరీలు చేశారు. కానీ మరికొన్ని సెంచరీలు చేసే అవకాశాన్ని కోల్పోయినట్లు తెలిపారు. ఎడమ చేతి బ్యాటర్ గంగూలీ.. టెస్టులు, వన్డేల్లో కలిపి మొత్తం 18575 రన్స్ చేశారు. అతను 311 వన్డేలు, 113 టెస్టులు ఆడారు. అయితే వీటిల్లో పలు సందర్భాల్లో సెంచరీలు చేసే అవకాశాన్ని చేజార్చుకున్నట్లు చెప్పారు. మీరేదైనా విషయం గురించి చింతిస్తున్నారా అని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ గంగూలీ ఈ వ్యాఖ్యలు చేశారు.ఎన్నో సెంచరీలు మిస్సయ్యానని, వాస్తవానికి మరిన్ని సెంచరీలు చేయాల్సి ఉందని, ఎన్నోసార్లు 90, 80 రన్స్ స్కోర్ చేసినట్లు తెలిపారు. క్రికెట్ గణాంకాల ప్రకారం సుమారు 30 సార్లు సెంచరీకి చేరువలో గంగూలీ ఔటైనట్లు తెలుస్తోంది. ఒకవేళ గంగూలీ ఆ ఇన్నింగ్స్‌లను సెంచరీలుగా మలిస్తే, అప్పుడు అతను 50 సెంచరీల మైలురాయిని దాటేవాడు. ఒంటరిగా



ఉన్న సమయంలో.. బ్యాటింగ్ వీడియోలను చూస్తుంటానని, తన భార్య సారా లండన్‌లో ఉంటుందని, ఆమెకు దూరంగా ఉన్న సమయంలో ఆ వీడియోలు చూస్తానని, యూట్యూబ్‌కు వెళ్లి వీడియోలు చూస్తానని, 70ల్లో ఔట్ అవ్వగానే .. సెంచరీ చేయాల్సి ఉండే అన్న భావన వస్తుందన్నాడు. కానీ గతాన్ని మార్చలేమన్నారు. వన్డేల్లో గంగూలీ మొత్తం 72 హాఫ్ సెంచరీలు చేశారు. ఇక టెస్టుల్లో 35 అర్ధశతకాలు సాధించారు. కెప్టెన్‌గా కొన్ని సందర్భాల్లో కీలకమైన ఆటగాళ్లను డ్రాప్ చేయడం పెద్ద సమస్య అన్నారు. పరిస్థితులకు తగినట్లు ఆ నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చేదని, అనిల్ కుంబ్లే గొప్ప బౌలర్ కానీ, పరిస్థితుల వల్ల అతన్ని పలుమార్లు తప్పించాల్సి వచ్చిందన్నారు. తనకు ఆస్ట్రేలియా ఫేవరేట్ ప్రత్యర్థి జట్టు అని, గ్లెన్ మెక్‌గ్రాత్ చాలా ప్రమాదకర బౌలర్ అన్నారు.





# కాజల్ ఫ్యామిలీ వెకేషన్..

## ఏకంగా బికినీలో దర్శనమిచ్చిందిగా..!

కలువ కళ్ల సుందరి కాజల్ అగర్వాల్ పెళ్లైన తర్వాత సినిమాలు తగ్గించింది. పూర్తిగా తన సమయాన్ని ఫ్యామిలీకి కేటాయిస్తుంది. ఏదో అడపాదడపా మాత్రమే సినిమాలు చేస్తుంది. టాలీవుడ్‌తో పాటు అన్ని భాషల ఇండస్ట్రీలోనూ మంచి గుర్తింపు, గౌరవం దక్కించుకుంది కాజల్. పెళ్లి తర్వాత సినిమాల ఎంపిక మొదలుకుని అన్ని విధాలుగా హుందాగా వ్యవహరించడం, ఒక వివాహితగా బాధ్యతాయుతంగా ఉండడం చూడముచ్చటగా అనిపిస్తుంది. తల్లి అయినప్పటి నుండి అయితే కొడుకు ఆలనాపాలనా చూసుకుంటూ సరదాగా గడుపుతుంది. ఎక్కడికి వెళ్లిన కొడుకుని తీసుకొనే వెళుతుంది.తాజాగా కాజల్ అగర్వాల్ మాల్దీవ్ వెకేషన్‌ని ఎంజాయ్ చేస్తుంది. కుమారుడు, కొడుకుతో పాటు తన చెల్లి నిషా అగర్వాల్‌తో ఫుల్ చిల్ అవుతుంది. ఎప్పుడు లేని విధంగా ఈ సారి బికినీ వేసి కుర్రాళ్ల మతులు పోగొట్టింది. వైట్ కలర్ బికినీలో సూపర్ హాట్‌గా కనిపిస్తున్న కాజల్‌ని చూసి నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. కాజల్ చెల్లి నిషా అగర్వాల్ కూడా హీరోయిన్ అన్న విషయం తెలిసిందే. ఇద్దరు బికినీలో కనిపిస్తూ తెగ ముచ్చట్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు. వారి పిక్స్ ఇప్పుడు వైరల్‌గా మారాయి. మొత్తానికి కాజల్ అగర్వాల్ తన మదర్ డ్యూటీని నిర్వర్తిస్తూనే ఎప్పటికప్పుడు కొడుకుతో ఉన్న ఫోటోలు, వీడియోలను షేర్ చేయడం ద్వారా మరింతగా ఫాలోవర్స్‌ను పెంచుకునే ప్రయత్నం చేస్తుంది. కాజల్ నటించిన కన్నప్ప సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఆ సినిమాలో గెస్ట్ పాత్రలో మాత్రమే కనిపిస్తుంది. ముందు ముందు సెకండ్ ఇన్నింగ్స్‌లో అక్కగా, అమ్మగా కాజల్ నటిస్తే కచ్చితంగా మరిన్ని ఆఫర్లు వచ్చే అవకాశం ఉంది. మరి కాజల్ అలా నటించేందుకు సిద్దమేనా , లేకుంటే హీరోయిన్‌గానే మరికొన్నాళ్లు కొనసాగిస్తుందా చూడాలి. 2020లో పెళ్లి చేసుకున్న కాజల్ 2022 ఏప్రిల్ 19న కుమారుడు నీల్ కిచ్లూకి జన్మనిచ్చింది. ఇక అప్పటి నుండి కాజల్ అగర్వాల్ సినిమాలకి కాస్త దూరంగానే ఉంటుంది.

# నిహారిక రెండో పెళ్లి చేసుకుంటుందా?

## నాగబాబు సమాధానమిదే

మెగా బ్రదర్ నాగబాబు కూతురు నిహారిక గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. యాంకర్ గా కెరీర్ మొదలు పెట్టిన ఆమె ఆ తర్వాత హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. కొన్ని విజయాలను ఖాతాలో వేసుకుంది. నిర్మాతగానూ కొన్ని సినిమాలు, వెబ్ సిరీస్ లు నిర్మించి సక్సెస్ అయ్యింది. ముఖ్యంగా గతేడాది నిహారిక నిర్మించిన మొదటి సినిమా కమిటీ కుర్రోళ్లు సూపర్ హిట్ అయ్యింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రదానం చేసిన గద్దర్ అవార్డుల్లోనూ ఈ సినిమాకు పురస్కారాలు వచ్చాయి. అయితే ప్రొఫెషనల్ లైఫ్ లో సక్సెస అయిన నిహారిక పర్సనల్ లైఫ్ లో మాత్రం ఒడిదొడుకులు ఎదుర్కొంది. ముఖ్యంగా తన పెళ్లి విషయంలో .. 2020లో జొన్నలగడ్డ చైతన్యను వివాహం చేసుకుంది మెగా డాటర్. రాజస్థాన్ లోని ఉదయపూర్ లో వీరి వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. కానీ వీరి కాపురం మూణ్ణాళ్ల ముచ్చటే అయింది. ఇద్దరి మధ్య భేదాభిప్రాయాలు తలెత్తాయి. దీంతో 2023లో పరస్పర అంగీకారంతో నిహారిక- చైతన్య విడాకులు తీసుకున్నారు. ఇక అప్పటినుంచి నిహారిక సింగిల్ గానే ఉంటోంది. అప్పుడప్పుడూ ఆమె రెండో పెళ్లి చేసుకుంటుందన్న వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ వార్తలపై నిహారిక తండ్రి నాగబాబు స్పందించారు.నిహారిక, నేను అన్ని విషయాలు ఓపెన్ గా మాట్లాడుకుంటాం. అలా అనీ నేను పిల్లల కెరీర్ విషయాల్లో తలదూర్చను. నా పిల్లల హిట్స్, ఫ్లాప్ గురించి నాకవసరం లేదు. వాళ్లు సంతోషంగా ఉన్నారా? లేదా? అన్నదే ముఖ్యం. వాళ్లు ఆనందంగా లేకపోతే ఎన్ని కోట్లున్నా వృథానే! వరుణ్.. లావణ్యను పెళ్లి చేసుకుంటానని నా దగ్గరకు వచ్చి అడిగినప్పుడు.. ఆమెతో నువ్వు హ్యాపీగా ఉంటావా? భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు రావు కదా?






# స్టార్ హీరోపై త్రిష స్పెషల్ పోస్ట్..

## మరోసారి తెరపైకి డేటింగ్ రూమర్స్. ఇంతకీ ఎవరతను..

దక్షిణ భారతదేశంలోని ప్రముఖ నటీమణులలో త్రిష కృష్ణన్ ఒకరు. దాదాపు రెండు దశాబ్దాలుగా సౌత్ ఇండస్ట్రీని ఏలేస్తుంది. ఈ ఏడాది వరుసగా హ్యాట్రిక్ హిట్స్ అందుకుంది. ఇటీవలే థగ్ లైఫ్ సినిమాతో మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. కమల్ హాసన్, శింబు కలిసి నటించిన ఈ చిత్రానికి మంచి రెస్పాన్స్ వచ్చింది. డైరెక్టర్ మణిరత్నం దర్శకత్వం వహించిన ఈ సినిమా జూన్ 5న విడుదలై విజయాన్ని అందుకుంది. అయితే సినిమాలతోపాటు త్రిష ఎక్కువగా వివాదాలతోనూ వార్తలలో నిలుస్తుంటుంది. ముఖ్యంగా ఓ స్టార్ హీరోతో ఆమె ప్రేమలో ఉందని.. కొన్నాళ్లుగా వీరిద్దరు లివ్ ఇన్ రిలేషన్ లో ఉన్నారంటూ ప్రచారం నడుస్తుంది. తాజాగా ఆ స్టార్ తో కలిసి ఉన్న ఫోటోను ఆమె షేర్ చేయడంతో డేటింగ్ రూమర్స్ మరోసారి తెరపైకి వచ్చాయి.ఇంతకీ త్రిష షేర్ చేసిన పోస్ట్ ఏంటో తెలుసా.. ? కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ దళపతి పుట్టినరోజు జూన్ 22. ఈ సందర్భంగా హ్యాపీ బర్త్ డే బెస్టెస్ట్ అంటూ ఆయనకు బర్త్ డే విషెస్ చెబుతూ ఓ ఫోటో షేర్ చేసింది. అందులో విజయ్ తన పెట్ డాగ్ తో ఆడుతుండగా.. తాను పక్కనే కూర్చుని కనిపిస్తుంది. దీంతో ఇప్పుడు త్రిష చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో తెగ వైరలవుతుంది. అలాగే అభిమానులకు మరోసారి సందేహాలు మొదలయ్యాయి. ఆ ఫోటో చూస్తే విజయ్ త్రిష ఇంట్లో ఉన్నట్లు కనిపిస్తుంది. కానీ ఇది ఇప్పటి ఫోటోనా.. ? లేదా పాత ఫోటోనా అనేది క్లారిటీ లేదు. కొన్నాళ్లుగా వీరిద్దరు ప్రేమలో ఉన్నట్లు రూమర్స్ నడుస్తున్నాయి. అయితే వీటిపై ఇప్పటివరకు వీరు ఇద్దరు స్పందించలేదు. విజయ్, త్రిష కలిసి గతంలో గిల్లి చిత్రంలో నటించారు. ఆ తర్వాత ఇటీవలే ఇద్దరు కలిసి లియో చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం విజయ్ జన నాయగన్ చిత్రంలో నటిస్తున్నారు విజయ్. అలాగే త్రిష మెగాస్టార్ చిరంజీవి సరసన విశ్వంభర చిత్రంలో నటిస్తుంది.





# రష్మికపై ప్రశంసలు..

## ఒకరేమో శ్రీదేవి అని, మరొకరేమో సౌందర్య అని..

నేషనల్ క్రష్ రష్మిక ఈ మధ్య వరుస హిట్స్ కొడుతూ గోల్డెన్ లెగ్‌గా మారింది. ఆమె ఇటీవలి కాలంలో నటించిన అన్ని చిత్రాలు మంచి విజయాలు సాధించాయి. రీసెంట్‌గా వచ్చిన కుబేర చిత్రం కూడా పెద్ద విజయం సాధించింది. కుబేర చిత్రం శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కగా, ఇందులో ధనుష్, రష్మిక, నాగార్జున ప్రధాన పాత్రలు పోషించారు. జూన్ 20న విడుదలైన ఈ చిత్రం మంచి విజయం సాధించింది. డే బై డే టికెట్లు తెగుతూనే ఉన్నాయి. షోలు యాడ్ అవుతూనే ఉన్నాయి. స్క్రీన్ల సంఖ్య పెరుగుతూనే ఉన్నాయి. తమిళంలో కంటే తెలుగులోనే ఈ చిత్రం ఎక్కువగా ఆడేస్తోంది. తెలుగు, ఓవర్సీస్‌లో మాత్రం కుబేర దుమ్ముదులిపేస్తోంది. ఇప్పటికే అరవై కోట్లకు పైగా గ్రాస్ సాధించినట్టుగా సమాచారం.కుబేరా' చిత్రం బ్లాక్‌బస్టర్ టాక్ తెచ్చుకోవడంతో తాజాగా సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సక్సెస్‌మీట్‌కి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా దర్శకుడు శేఖర్ కమ్ముల, నటులు నాగార్జున, ధనుష్‌లపై చిరంజీవి ప్రశంసల వర్షం కురిపించారు. అయితే ఈ ఈవెంట్‌లో రష్మిక మందన్నపై చిరంజీవి, నాగార్జున చేసిన కామెంట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నాగార్జున మాట్లాడుతూ, “శేఖర్ కమ్ముల ఇచ్చిన ఈ పాత్ర మొదట ఇబ్బందిగా అనిపించినా, నా పెర్ఫార్మెన్స్‌కి మంచి స్పందన రావడంతో చాలా సంతృప్తిగా ఉంది. ఆ క్రెడిట్ పూర్తిగా శేఖర్‌కే చెందుతుంది” అన్నారు. ఇక రష్మిక గురించి మాట్లాడుతూ.. ఆమెను అందరూ నేషనల్ క్రష్ అంటారు, ఇప్పటి నుండి నాకు క్రష్. క్షణక్షణం లో శ్రీదేవి ఎలా కనిపించారో, రష్మిక ఈ సినిమాలో అలా కనిపించింది అని వ్యాఖ్యానించారు. ఆయన మాటలపై రష్మిక ఎంతో సంతోషపడింది. ఇక మెగాస్టార్ చిరంజీవి కూడా రష్మికపై ప్రశంసలు కురిపిస్తూ “ నేను చెప్పాల్సింది నువ్వే చెప్పేశావ్ నాగ్. రష్మిక నేషనల్ క్రష్ మాత్రమే కాదు%౫% నా క్రష్ కూడా. నీ మొదటి సినిమా ఈవెంట్‌కి కూడా నేనే గెస్ట్‌గా వచ్చాను. అప్పటి నుంచి నీ అభినయాన్ని గమనిస్తున్నా . సినిమా సినిమాకి నీ ఇమేజ్ పెరుగుతూనే ఉంది. కుబేరా చిత్రంలో రష్మిక మొదట్లో మోసపోయే సీన్ చూస్తే నాలో సౌందర్యని గుర్తుకు తెచ్చింది. క్లైమాక్స్ ముందు చిన్న పిల్లాడిని చేతిలో పట్టుకున్నప్పుడు నీ యాక్టింగ్ అసాధారణంగా ఉంది. స్క్రీన్ మీద నువ్వు కనిపిస్తే నీ కళ్లకే అట్టిపడిపోతాం. నువ్వు కళ్లతోనే నటించగలవు. నువ్వు నేషనల్ క్రష్ కాదు ఇంటర్నేషనల్ క్రష్” అంటూ చిరంజీవి రష్మికపై ప్రశంసలు కురిపించారు.



Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492